ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



తమిళనాడు
TAMILNADU

గురువారం 21 నవంబరు 2024



ఇకపై భార్యగా నటించను

మీనాక్షి చౌదరి



ఒకేసారి పారితోషికం పెంచొద్దు

దర్శకుడు పేరరసు

7లో..

'పోలిహోస్'కార్యాలయాల్లో ఐటీ తనిఖీలు

చెన్నై, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిండి, ఇరుంగాట్టుకోటలో పెట్రోలు బంకుల్లో ఉపయోగించే రబ్బరు పైపులు, ట్యూబ్‌లు తయారు చేసే పోలిహోస్ సంస్థకు చెందిన కార్యాలయాలు సహా 20 చోట్ల ఆదాయపు పన్నుల శాఖ అధికారులు రెండోరోజూ తనిఖీలు కొనసాగించారు. స్విట్జర్లాండుకు చెందిన ఇటాల్ ప్లాస్టిక్ కాంపౌండ్స్ సంస్థతో కలిసి రబ్బరు పైపులు, ట్యూబ్‌లు తయారు చేసి విదేశాలకు ఎగుమతి చేస్తున్న ఈ సంస్థలో గత రెండేళ్లుగా ఆదాయాన్ని తక్కువగా చూపి భారీస్థాయిలో పన్నుల ఎగవేతకు పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. వాటి ఆధారంగా మంగళవారం ఉదయం ఐటీ అధికారులు ఇరుంగాట్టుకోట సిప్కాట్, అంబత్తూరు పారిశ్రామికవాడ, వల్లం, మాంబాక్కం, తిరుప్పోరూరు ప్రాంతాల్లోని ఆ సంస్థకు చెందిన కార్యాలయాలు, గిండిలోని ప్రధాన కార్యాలయం, అభిరామపురంలో సంస్థ యజమాని సబీర్ యూసఫ్ నివాసంలో తనిఖీలు జరిపారు. బుధవారం సాయంత్రం వరకూ ఈ తనిఖీలు కొనసాగాయి. ఈ సోదాల్లో పన్నుల ఎగవేతకు సంబంధించిన కీలక పత్రాలు, లక్షలాది రూపాయల విలువచేసే షేర్లు, నగదు, కంప్యూటర్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది.

మణిపూర్ హైకోర్టు సీజేగా జస్టిస్ కృష్ణకుమార్



చెన్నై, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డి.కృష్ణకుమార్ మణిపూర్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమితులయ్యారు. ఈ మేరకు ఇటీవల సుప్రీంకోర్టు చేసిన సిఫారసులను భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బుధవారం ఆమోదించినట్లు కేంద్ర న్యాయశాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్ బుధవారం ప్రకటించారు. ఆ మేరకు కేంద్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. జస్టిస్ కృష్ణకుమార్ 2016 ఏప్రిల్ 7న మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు. పలు కీలక తీర్పులిచ్చారు. హైకోర్టులో సీనియర్ న్యాయమూర్తి కావడంతో గత ఏడాది హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగానూ వ్యవహరించారు. వచ్చే ఏడాది మే 21వ తేదీ పదవీ విరమణ చేయనున్న జస్టిస్ కృష్ణకుమార్ మణిపూర్ హైకోర్టుకు ప్రధాన న్యాయమూర్తిగా వెళ్లనున్నారు. 1963 మే 22వ తేదీన ఏపీ దేవసిగామణి, సరస్వతి దంపతులకు జన్మించిన కృష్ణకుమార్ స్వస్థలం తిరుప్పూర్ జిల్లా తారాపురం. అక్కడే ఆయన ప్రాథమిక, మాధ్యమిక విద్యాభ్యాసం జరిగింది. చెన్నై ప్రెసిడెన్సీ కాలేజీలో బీఎస్సీ చదివిన ఆయన.. అనంతరం మద్రాస్ లా కాలేజీలో బీఎల్ పూర్తి చేశారు. 1987లో బార్ కౌన్సిల్‌లో పేరు నమోదు చేసుకున్న ఆయన.. అప్పటి నుంచి మద్రాస్ హైకోర్టులో ప్రాక్టీసు చేశారు. పలుమార్లు ప్రభుత్వ న్యాయవాదిగానూ వ్యవహరించారు.



సమావేశంలో పాల్గొన్న కార్యాచరణ మండలి సభ్యులు

మోగించండి ప్రచార భేరి!

- అసెంబ్లీ ఎన్నికలపై పార్టీ శ్రేణులకు డీఎంకే పిలుపు
- బీజేపీ అసమర్థ పాలనపై ఖండన
- ఉన్నత కార్యాచరణ మండలిలో 6 తీర్మానాలు



సమావేశంలో ప్రసంగిస్తున్న స్టాలిన్

చెన్నై, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): డీఎంకే ద్రావిడ తరహా సుపరిపాలనలో గత మూడున్నరేళ్లలో ముఖ్యమంత్రి స్టాలిన్ అమలు చేసిన పథకాలు, సాధించిన విజయాలపై ప్రచార కార్యక్రమాలను ప్రారంభించాలని స్టాలిన్ పిలుపునిచ్చారు. ప్రతి కార్యకర్త ఉద్యమ తరహాలో ఇంటింటి ప్రచారం చేయాలని, ప్రభుత్వ పథకాలపై కరపత్రాలు ముద్రించి పంపిణీ చేయాలని, తిన్నెల ప్రచారం కూడా చేయాలని పార్టీ శ్రేణులకు విజ్ఞప్తి చేసారు. తేనాంపేటలోని అన్నా అరివాలయంలో బుధవారం ఉదయం డీఎంకే ఉన్నత కార్యాచరణ మండలి సమావేశం పార్టీ అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఆరు కీలక తీర్మానాలను ఆమోదించారు.

బీజేపీది వేర్పాటు వాదమే...


నైతిక విలువలను తోసిపుచ్చి, వేర్పాటువాద భావాలను అమలు చేసేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్న బీజేపీ ప్రజావ్యతిరేక విధానాలను ఖండిస్తూ ఉన్నత కార్యాచరణ మండలి మరో తీర్మానం చేసింది. లోక్‌సభ ఎన్నికల్లో స్పష్టమైన మెజారిటీ సంపాదించలేకపోయామనే తలంపే లేకుండా బీజేపీ పాలకులు సామాజిక న్యాయానికి వ్యతిరేకంగా ప్రవర్తిస్తున్నారంటూ తీర్మానంలో మండలి ఆరోపించింది. తమిళ జాలర్ల అక్రమ నిర్బంధం, పడవల స్వాధీనం, జైలు శిక్షలు విధిస్తూ శ్రీలంక నావికాదళం, అక్కడి ప్రభుత్వ పాలకులు చేస్తున్న అక్రమ చర్యలు ఖండిస్తూ మరొక తీర్మానం చేశారు. ఆ తీర్మానంలో తమిళ జాలర్లపై శ్రీలంక నావికాదళం చేసే అక్రమ దాడులను శాశ్వతంగా అరికట్టే దిశగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. శ్రీలంక ప్రభుత్వంతో కేంద్రం చర్చలు జరిపి జాలర్ల అక్రమ నిర్బంధాలు, జరిమానా, జైలు శిక్షల నుండి కాపాడాలని విజ్ఞప్తి చేశారు. మణిపూర్‌లో సాగుతున్న అల్లర్లను నిరోధించడంలో రాష్ట్రంలోను, కేంద్రంలోనూ అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వాలు పూర్తిగా విఫలం కావటం పట్ల తీవ్ర నిరసన ప్రకటిస్తూ మరో తీర్మానం ఆమోదించారు.

పథకాలకు 50 శాతం నిధులు..

రాష్ట్రంలో ప్రజా సంక్షేమ పథకాల అమలుకు కేంద్రం పన్నుల రూపేణా వసూలు చేస్తున్న ఆదాయంలో 50 శాతం కేటాయించాలని, పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్న, అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలకు మరింత నిధులు కేటాయించాలని కోరుతూ డీఎంకే ఉన్నత కార్యాచరణ మండలి ఓ తీర్మానం ప్రతిపాదించింది. ఇటీవల ముఖ్యమంత్రి స్టాలిన్‌ను కలుసుకున్న 16వ ఆర్థిక సంఘం సభ్యులకు ఈ విషయమై వినతి పత్రాన్ని సమర్పించిన విషయాన్ని కూడా ఆ తీర్మానంలో గుర్తు చేసింది. సమావేశం చివరగా 2026లో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల ప్రచారాన్ని తక్షణమే ప్రారంభించమంటూ పార్టీ శ్రేణులకు విజ్ఞప్తి చేస్తూ తీర్మానం ప్రతిపాదించింది. ఇలా ఈ సమావేశంలో మొత్తం ఆరు తీర్మానాలు ప్రతిపాదించి ఆమోదించారు. సమావేశంలో డీఎంకే ప్రధాన కార్యదర్శి, సీనియర్ మంత్రి దురైమురుగన్, కోశాధికారి టీఆర్ బాలు, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, మంత్రులు పొన్ముడి, కేఎన్ నెహ్రూ, దామో అన్బరసన్ ఐ. పెరియసామి, సామినాథన్, ఎంపీలు కనిమొళి, దయానిధి మారన్, ఎ.రాజా తదితరులు పాల్గొన్నారు.

సీబీఐకి కల్తీసారా కేసు

● హైకోర్టు తీర్పు



చెన్నై, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కళ్ళకురిచ్చి కరుణాపురంలో గత జూన్ 18న మెథనాల్ కలిపిన సారా తాగి 69 మంది మృతి చెందిన కేసును సీబీఐకి అప్పగించాలని మద్రాసు హైకోర్టు సంచలన తీర్పునిచ్చింది. కల్తీసారా తాగి 193 మంది తీవ్ర అస్వస్థతకు గురికాగా, వారిలో 69 మంది మరణించిన విషయం తెలిసిందే. ఈ కల్తీసారా మరణాల ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర కలకలం సృష్టించింది. ఈ కేసుపై సీబీసీఐడీ విచారణ చేపట్టింది. ఆ నేపథ్యంలో ఈ కేసు విచారణను సీబీఐకి బదిలీ చేయాలని కోరుతూ అన్నాడీఎంకే తరపు న్యాయవాది ఐఎస్ ఇన్బదురై, న్యాయవాదుల సామాజిక న్యాయ సంఘం అధ్యక్షుడు, పీఎంకే ప్రచార ప్రతినిధి కె.బాలు, బీజేపీ న్యాయవాది ఏర్కాడు ఎ.మోహన్‌దాస్, డీఎంకే మాజీ ఎమ్మెల్యే పార్థసారథి, అన్నాడీఎంకే మాజీ ఎమ్మెల్యే వాల్పారై డాక్టర్ శ్రీధరన్ తదితరులు మద్రాసు హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు వేశారు. వాటిపై న్యాయమూర్తులు జస్టిస్ డి.కృష్ణకుమార్, జస్టిస్ పీపీ బాలాజీతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. పిటిషనర్ల తరఫున హాజరైన న్యాయవాదులు డి.సెల్వం, జీఎస్ మణి, కె.బాలు ధర్మాసనం ఎదుట తమ వాదనలు వినిపిస్తూ గత యేడాది మరక్కాణంలో ఇదే రీతిలో కల్తీసారా తాగి 30 మంది మరణించారని, ఈ యేడాది కళ్ళకురిచ్చి కరుణాపురంలో అదే రీతిలో మరో సంఘటన జరిగిందని వివరించారు. ఈ రెండు సంఘటనల బట్టి రాష్ట్రంలో కల్తీసారా విచ్చలవిడిగా దొరుకుతుందని సుస్పష్టమవుతోందని, పొరుగు రాష్ట్రాలైన పుదుచ్చేరి, ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాల నుండి మెథనాల్ తీసుకువచ్చి మరీ కల్తీసారా తయారు చేస్తున్నారని, పోలీసులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ అంశాలను పరిశీలిస్తే కల్తీసార దుర్ఘటనలో పోలీసు ఉన్నతాధికారులు, రాజకీయ నేతలకు సంబంధాలు ఉన్నట్లు స్పష్టమవుతుందన్నారు. ఈ పరిస్థితుల్లో కేసును సీబీఐ దర్యాప్తు చేస్తే వాస్తవాలు వెల్లడవుతాయని, అసలు నేరస్థులు పట్టుబడతారన్నారు. కళ్లకురిచ్చి కల్తీసారా సంఘటనకు బాధ్యులైనవారినందరినీ రాష్ట్ర ప్రభుత్వం అరెస్టు చేసిందని, మృతుల కుటుంబాలకు, అస్వస్థతకు గురైన వారికి ప్రభుత్వం భారీగా ఆర్థికసాయం కూడా అందించడంతో పాటు భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరుగకుండా ఉండేందుకు హైకోర్టు మాజీ న్యాయమూర్తి పి.గోకుల్‌దాస్ నాయకత్వంలో ప్రత్యేక కమిటీని కూడా ఏర్పాటు చేసిందని ప్రభుత్వ తరపు న్యాయవాదులు పీఎస్ రామన్, జె.రవీంద్రన్, హసన్ మహమ్మద్ జిన్నా వివరించారు. నేరస్థులను పట్టుకోవడానికి ప్రభుత్వం 16 ప్రత్యేక పోలీసు బృందాలు ఏర్పాటు చేసి 24 మందిని అరెస్టు చేసిందని, వారిలో 11మందిపై గూండా చట్టం కూడా ప్రయోగించిందని తెలిపారు. సీబీసీఐడీ పోలీసుల దర్యాప్తు పూర్తవుతున్న తరుణంలో కేసును సీబీఐకి మార్చాల్సిన అవసరం లేదని కోరారు. ఇరుపక్షాల వాద ప్రతివాదనల అనంతరం ధర్మాసనం బుధవారం తీర్పు వెలువరించింది. సమాజంలో ఏర్పడే అన్ని సమస్యలకు మద్యం లేదా సారా ముఖ్య కారణమవుతోందని, కళ్లకురిచ్చి కల్తీసారా సంఘటన స్థానిక పోలీసులకు తెలియకుండా జరిగిందనే వాదన సరికాదని కటువుగా వ్యాఖ్యానించింది. పోలీసులు చూసీ చూడనట్లు వ్యవహరించినట్లు పిటిషనర్ల తరఫు వాదనలను బట్టి స్పష్టమవుతోందని పేర్కొంటూ ఈ సంఘటనకు సంబంధించి ఉన్నతాధికారులపై తీసుకున్న చర్యలను రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవడం కూడా పలు అనుమానాలకు తావిచ్చేలా ఉందని దుయ్యబట్టింది. కళ్ళకురిచ్చి కల్తీసారా ఘటన కేసును సీబీఐకి బదిలీ చేస్తున్నట్లు ప్రకటించిందవి. ఈ కేసుకు సంబంధించిన అన్ని దస్తావేజులను సీబీసీఐడీ పోలీసులు వెంటనే సీబీఐ అధికారులకు అప్పగించాలని, వాటిని పరిశీలించి సీబీఐ దర్యాప్తు ప్రారంభించి దోషులకు తగిన శిక్షపడేలా చేయాలని ఆదేశించింది.

అప్పీలుపై పరిశీలన : మంత్రి రఘుపతి

కళ్లకురిచ్చి కల్తీసారా సంఘటన విచారణను సీబీఐకి బదిలీ చేస్తూ హైకోర్టు ఇచిచన తీర్పుపై అప్పీలుకు వెళ్లే విషయంపై ముఖ్యమంత్రి స్టాలిన్‌తో చర్చించి, నిర్ణయం తీసుకుంటామని రాష్ట్ర న్యాయశాఖ మంత్రి రఘుపతి తెలిపారు. పుదుకోటలో బుధవారం మధ్యాహ్నం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కళ్లకురిచ్చి కల్తీసారా బాధితుల తరఫున ఎవరూ సీబీఐ విచారణ కోరలేదని, రాష్ట్రంలోని కొన్ని రాజకీయ పార్టీలే కోరాయనే విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇదిలా ఉండగా కల్తీసారా సంఘటనపై హైకోర్టు ఇచ్చిన తీర్పుపై రాష్ట్ర ప్రభుత్వం అప్పీలుకు వెళ్ళకూడదంటూ పీఎంకే వ్యవస్థాపకుడు రాందాస్, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి, అమ్మామక్కల్ మున్నేట్ర కళగం నేత దినకరన్, డీఎండీకే నాయకురాలు ప్రేమలత వేర్వేరు ప్రకటనల్లో డిమాండ్ చేశారు.

రామనాథపురంలో కుండపోత

- స్తంభించిన జనజీవనం



రామేశ్వరంలో జలమయమైన ఫ్లైఓవర్ మార్గం

చెన్నై, నవంబరు20 (ఆంధ్రజ్యోతి): రామనాథపురం జిల్లాలో మంగళవారం సాయంత్రం నుంచి అర్ధరాత్రి ఒంటి గంట వరకు ఉరుములు, మెరుపులు, పెనుగాలుతో కుండపోతగా వర్షాలు కురువటంతో జనజీవనం స్తంభించింది. ఆ జిల్లాలోని ప్రధాన రహదారుల్లో వర్షపునీరు ప్రవహించింది. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచిపోయింది. దక్షిణ అండమాన్ పరిసర ప్రాంతాల్లో ఉపరితల ఆవర్తనం, బంగాళాఖాతంలో పెనుగాలుల కారణంగా రామనాథపురం పరిసర ప్రాంతాల్లో గత రెండు రోజులుగా వర్షాలు కురిశాయి. మంగళవారం సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు రామేశ్వరం, తంగచ్చిమఠం, పాంబన్ తదితర ప్రాంతాల్లో వర్షం కురిసింది. రామనాథస్వామి ఆలయ మాడవీధుల్లో వర్షపునీరు వరదలా ప్రవహించింది. రామేశ్వరం, పాంబన్ తదితర తీర ప్రాంతాల్లో అలల ఉధ్రుతి అధికమైంది. సుమారు ఐదు మీటర్ల ఎత్తున అలలు తీరం వైపు ఎగసిపడ్డాయి. అలల తాకిడి అధికం కావటంతో జాలర్లు బుధవారం చేపలవేటకు వెళ్లలేదు. ఇదేవిధంగా రామనాథపురం, పరమకుడి, తిరువట్టానై, ఆర్ఎస్ మంగళం, కీళ్‌కరై, ముదుగళత్తూరు, కముది, కడలాడి, సత్తిరకుడి తదితర ప్రాంతాల్లో బుధవారం ఉదయం కూడా ఓ మోస్తరు వర్షం కురిసింది. వర్షం కారణంగా జిల్లాలోని విద్యాలయాలకు రామనాథపురం కలెక్టర్ సిమ్రన్‌జిత్ సింగ్ సెలవు ప్రకటించారు. ఇదిలా ఉండగా మండపం ఉత్తర ఓడరేవు ప్రాంతంలో మంగళవారం అర్ధరాత్రి పెనుగాలులతో భారీ వర్షాలు కురిశాయి. ఆ సమయంలో తీరం ఒడ్డున లంగరేసిన 15 మరపడవలు అలలతాకిడి ఎగిరి పడి ధ్వంసమయ్యాయి. దీంతో జాలర్లు తీవ్ర ఆందోళన చెందారు.



జలమయమైన రామనాథపురం బస్టాండు

తరగతి గదిలో టీచర్ దారుణహత్య

- తంజావూరులో ప్రేమోన్మాది ఘాతుకం



టీచర్ రమణి (ఫైల్‌ఫోటో)

చెన్నై, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): తంజావూరు జిల్లా మల్లిపట్టినం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలు దారుణహత్యకు గురయ్యారు. తనను పెళ్లి చేసుకోడానికి నిరాకరించేందనే ఆగ్రహంతో ఓ ప్రేమోన్మాది ఆమెను కత్తితో పొడిచి దారుణంగా హత్యచేశాడు. తరగతి గదిలో జరిగిన ఈ సంఘటన చూసి విద్యార్థులు భయంతో పరుగెత్తారు. మల్లిపట్టినం సమీపం చిన్నమలై ప్రాంతంలో నివసిస్తున్న రమణి (26) అక్కడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తమిళ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. చిన్నమలై ప్రాంతానికే చెందిన పన్నీర్‌సెల్వం కుమారుడు మదన్‌కుమార్ (30) రమణిని ప్రేమిస్తున్నానంటూ వెంటపడేవాడు. అంతేగాక రమణిని వివాహం చేసుకునేందుకు ఆమె పెద్దలతో మాట్లాడాలంటూ రెండు రోజుల క్రితం తన తల్లిదండ్రులను పంపించాడు. అయితే మదన్‌కుమార్‌ను పెళ్లి చేసుకోవడం తనకు ఇష్టం లేదని, తాను ఇప్పుడే ఉద్యోగంలో చేరానని, ఇప్పట్లో పెళ్లి చేసుకోవాలనే ఆలోచన కూడా లేదని స్పష్టం చేసింది. ఈ విషయం తెలిసి మదన్‌కుమార్ బుధవారం ఉదయం రమణి పనిచేస్తున్న పాఠశాలకు వెళ్ళాడు. ప్లస్ వన్ విద్యార్థులకు పాఠాలు చెబుతున్న రమణి వద్దకు వెళ్ళి తనను పెళ్ళి చేసుకునేందుకు ఎందుకు నిరాకరించావంటూ కేకలేశాడు. వెంటనే తనతో తెచ్చిన కత్తితో ఆమెపై దాడి చేశాడు. అనంతరం అక్కడి నుంచి పారిపోయాడు. తీవ్రంగా గాయపడిన రమణి తరగతి గదిలో కుప్పకూలిపడింది. రక్తపుమడుగులో కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న రమణిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తీసుకెళుతుండగా మార్గమధ్యంలోనే ఆమె ప్రాణాలు విడిచింది. ఈ ఘటనపై సేతుబావాసత్తిరం పోలీసులు కేసు నమోదు చేసుకుని మదన్‌కుమార్‌ను అరెస్టు చేశారు. ఈ సంఘటన తంజావూరు ప్రాంతంలో తీవ్ర చర్చనీయాంశమైంది.



ఉన్మాది మదన్‌కుమార్

విద్యామంత్రి దిగ్భ్రాంతి...

ఉపాధ్యాయురాలి హత్య పట్ల పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ తీవ్ర దిగ్భ్రాంతి చెందారు. ఈ దారుణాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. కత్తితో దాడిచేసిన యువకుడిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రమణి మృతితో శోకతప్తులైన ఆమె కుటుంబీకులకు, విద్యార్థులకు, సహచర ఉపాధ్యాయులకు తన ప్రగాఢ సంతాపం వ్యక్తం చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. పాఠశాలలో టీచర్‌పై దాడిని ఖండించిన సీఎం స్టాలిన్, ఆమె మృతి పట్ల తీవ్ర సంతాపం తెలిపారు. అదే విధంగా మృతురాలి కుటుంబానికి రూ.5లక్షల సాయం ప్రకటించారు.

ఈపీఎస్ ఖండన...

టీచర్ దారుణహత్యకు గురికావటం పట్ల అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్), అమ్మామక్కల్ మున్నేట్ర కళగం నేత టీటీవీ దినకరన్, పీఎంకే వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్, అధ్యక్షుడు అన్బుమణి రాందాస్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తరగతి గదిలో తమిళ టీచర్ దారుణహత్యకు గురికావటం తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని ఈపీఎస్ తెలిపారు. ఆమె కుటుంబీకులకు పార్టీ తరఫున తన ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి స్టాలిన్ శాంతి భద్రతలను పరిరక్షించడంపై దృష్టి సారించాలని ఈపీఎస్ సూచించారు.

సమాచార దర్శిని

రేపు ప్రైవేటు జాబ్ మేళా

పెరంబూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిండి సమీపం ఆలందూర్ రోడ్డులోని ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్ కార్యాలయంలో శుక్రవారం ప్రైవేట్ జాబ్ మేళా జరుగనుంది. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే ఈ శిబిరంలో 8వ తరగతి నుంచి డిగ్రీ వరకు ఉత్తీర్ణులైన వారు పాల్గొనవచ్చు. ఈ శిబిరంలో సుమారు 20కి పైగా సంస్థలు తమకు అవసరమైన అభ్యర్థులను ఎంపిక చేసుకోనున్నాయి. ఆసక్తి కలిగిన వారు తమ దరఖాస్తులను www.tnprivatejobs.tn.gov.in అనే వెబ్‌సైట్‌లో నమోదుచేసుకోవచ్చు.

చెంబరంబాక్కంలో 2 టీఎంసీల నీరు

పెరంబూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నగరవాసుల తాగునీటి అవసరాలను తీర్చు జలాశయాల్లో ఒకటైన చెంబరంబాక్కం 3.645 టీఎంసీల సామర్థ్యం కలిగి ఉంది. జలాశయ పరివాహక ప్రాంతాల్లో కొద్దిరోజులుగా వర్షాలు కురుస్తుండడంతో జలాశయానికి ఇన్‌ఫ్లో పెరిగింది. గత వారం 1.37 టీఎంసీలున్న నీటి నిల్వలు, మంగళవారం 2 టీఎంసీలకు చేరాయి. జలాశయానికి 400 ఘనపుటడుగుల నీరు వస్తుండగా, 134 ఘనపుటడుగుల నీరు దిగువకు విడుదల చేస్తున్నట్లు ప్రజాపనుల శాఖ అధికారులు తెలిపారు.

రూ.5.75 కోట్లతో పోరూర్‌లో పార్క్

పెరంబూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆలందూర్ మండలం ముగిలివాక్కం ప్రాంతంలోని పోరూర్ చెరువు గట్టుపై రూ.5.75 కోట్లతో పార్క్ ఏర్పాటు చేయనున్నారు. ఈ విషయమై గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ అధికారులు మాట్లాడుతూ... ఈ చెరువు గట్టు వెంబడి 3.4 కి.మీ మేర రూ.5.73 కోట్లతో వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయనున్నామన్నారు. అలాగే, వృద్ధులు, మహిళలు కూర్చునేందుకు బెంచీలు, పిల్లలు ఆడుకొనేందుకు ప్రత్యేక ఏర్పాట్లు ఉంటాయని, ఆరు నెలల్లో పనులు పూర్తిచేసి పార్క్‌ను ప్రజల అందుబాటులోకి తీసుకొస్తామని వారు పేర్కొన్నారు.

రేపు అగదీశ్వరర్ ఆలయ కుంభాభిషేకం

పెరంబూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కాంచీపురం జిల్లా ఉత్తిరమేరూర్ పంచాయతి ఆళవారంపూండి గ్రామంలో భువనేశ్వరి అమ్మవారి సమేత ఆకదీశ్వరర్ స్వామి ఆలయం ఉంది. ఈ ఆలయ కుంభాభిషేకం శుక్రవారం జరుగనుంది. వేడుకల్లో భాగంగా గురువారం ఉదయం 9గంటలకు మహాగణపతి హోమం, నవగ్రహ హోమం జరుగనున్నాయి.శుక్రవారం ఉదయం 10 గంటలకు కుంభాభిషేకం జరుగుతుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

వర్సిటీల్లో బయోమెట్రిక్ తప్పనిసరి

పెరంబూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల్లో బయోమెట్రిక్ విధానం అమలుకానుంది. ప్రొఫెసర్లు, బోధనేతర సిబ్బంది విధుల సమయంలో ఉన్నతాధికారుల అనుమతి లేకుండా బయటకు వెళ్తున్నట్లు, కొందరు సక్రమంగా హాజరుకావడం లేదని ఫిర్యాదులున్నాయి. ఈ సమస్యలు పరిష్కరించేలా వర్సిటీల్లో ప్రొఫెసర్లు, బోధనేతర సిబ్బంది అటెండెన్స్ బయోమెట్రిక్‌లో నమోదుచేయాలని ఉన్నత విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది.

28 నుంచి కు.ని శిబిరాలు

పెరంబూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) పరిధిలోని 15 మండలాల్లో ఉన్న నగర ప్రాంత ఆరోగ్య కేంద్రాల్లో ఈ నెల 28 నుంచి డిసెంబరు 4వ తేది వరకు పురుషులకు కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సా శిబిరాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు జీసీసీ ఆరోగ్య శాఖ విడుదల చేసిన ప్రకటనలో.. కుట్లు, గాట్లు లేకుండా ఆధునిక పద్ధతుల్లో కు.ని శస్త్రచికిత్సలు చేయనున్నామన్నారు. ఈ శస్త్రచికిత్స చేయించుకున్న పురుషులకు తలా రూ.1,100 నగదు, వారిని తీసుకొచ్చిన వారికి తలా రూ.200 అందించనున్నామని తెలిపింది. శస్త్రచికిత్స ముగిసిన గంట తర్వాత ఇంటికి వెళ్లొచ్చని, మహిళల ఆరోగ్యం దృష్ట్యా పురుషులు ఈ శస్త్రచికిత్సకు ముందుకు రావాలని జీసీసీ విజ్ఞప్తి చేసింది.

వివేకానంద పడవ సవారీ రద్దు

పెరంబూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కన్నియాకుమారి సముద్రం మధ్యలోని వివేకానంద రాక్‌కు పడవ సవారీ తాత్కాలికంగా రద్దు చేశారు. ప్రపంచ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రమైన కన్నియాకుమారికి వచ్చే పర్యాటకులు, సముద్రంలో మధ్యలోని వివేకానంద స్మారక మండపం, మండపం సమీపంలోని 133 అడుగుల ఎత్తున్న తిరువళ్లువర్ విగ్రహం వద్దకు వెళ్లేందుకు ఆసక్తి చూపుతుంటారు. పర్యాటకుల సౌకర్యార్థం కన్నియాకుమారి బోట్ హౌస్ నుంచి పుంపుహార్ సంస్థ ఉద యం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పడవలు నడుపుతోంది. ఈ నేపథ్యంలో, కన్నియాకుమారిలో భారీ వర్షాలు కురుస్తుండడం, సముద్రపు అలలు ఎగిసిపడుతున్న నేపథ్యంలో, పడవ సవారీ తాత్కాలికంగా రద్దు చేసినట్లు, వాతావరణం అనుకూలించిన తర్వాతే పడవలు యధావిధిగా నడుపుతామని పుంపుహార్ సంస్థ తెలియజేసింది.

ఒకేరోజు 12 విమాన సర్వీసులు రద్దు

పెరంబూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక త్రిశూలం విమానాశ్రయంలో బుధవారం ఒకే రోజు 12 విమాన సర్వీసులు రద్దయ్యాయి. భువనేశ్వర్, కోల్‌కతా, బెంగళూరు, తిరువనంతపురం, సిలిగురికి వెళ్లాల్సిన విమానాల, రావాల్సిన విమానాలు మొత్తం 12 విమాన సేవలు రద్దయ్యాయి. రద్దయిన విమానాలు ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్‌కు చెందినవి కావడం విశేషం. నిర్వహణ కారణాలతో విమానాలు రద్దు చేస్తున్నట్లు ఆ సంస్థ ప్రకటించింది. కొద్దిరోజులుగా చెన్నై విమానాశ్రయంలో విమాన సర్వీసులు హఠాత్తుగా రద్దు చేస్తుండడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

చెట్టును ఢీకొన్న బైక్

ముగ్గురు విద్యార్థుల దుర్మరణం



మృతిచెందిన విద్యార్థులు (ఫైల్‌ఫొటో)

పెరంబూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై జిల్లా కీళ్‌పెన్నాతూర్ సమీపంలో చెట్టును బైక్ ఢీకొన్న ఘటనలో ముగ్గురు విద్యార్థులు మృతిచెందారు. వెట్టవలం గ్రామానికి చెందిన ముత్తులింగం (16), చిన్న ఓలైపాడి గ్రామానికి చెందిన రామన్ (17), ఇసుగలి కాటేరి గ్రామానికి చెందిన జగదీష్ (17) వెట్టవంలోని ప్రభుత్వ బాలుర మహోన్నత పాఠశాలలో ప్లస్ టూ చదువుతున్నారు. మంగళవారం సాయంత్రం పాఠశాల ముగిసిన తరువాత ముత్తులింగం సహా ముగ్గురు ఒకే బైక్‌లో వెట్టవలం నుంచి బయల్దేరారు. ఆవూరు మురుగన్ ఆలయ సమీపంలో బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీకొంది. ఈ ఘటనలో ముత్తులింగం అక్కడికక్కడే మృతిచెందగా, రామన్, జగదీష్‌లకు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న వెట్టవలం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని, ఇద్దరిని 108 అంబులెన్స్‌లో తిరువణ్ణామలై ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం ఇద్దరిని వేలూరు ప్రభుత్వ వైద్యకళాశాలకు తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో రామన్ మృతిచెందాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జగదీష్ బుధవారం తెల్లవారుజామున మృతిచెందాడు. ఈ ఘటనపై వెట్టవలం పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

జనరేటర్ పేలి ఇద్దరు ...

కోయంబత్తూర్ గణపతి ప్రాంతంలో ఒకరు మరణించగా, మృతుడి ఇంట్లో కరెంట్ లేకపోవడంతో, ఫ్రీజర్ బాక్స్‌కు జనరేటర్ ద్వారా విద్యుత్ కనెక్షన్ ఇచ్చారు. ఆ సమయంలో జనరేటర్ నుంచి డీజిల్ లీకవడంతో మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో గాయపడిన నలుగురిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స ఫలించక భానుమతి (50), రాజేశ్వరన్ (52) మృతిచెందారు. సోమవారం చోటుచేసుకున్న ఈ ఘటనలో పద్మావతి అనే మహిళ చికిత్స ఫలించక మృతిచెందిన నేపథ్యంలో, ఈ ఘటనలో మరో ఇద్దరు మృతిచెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది.

ఇంట్లో తల్లీ, కొడుకుల మృతదేహాలు

కుళ్లిన స్థితిలో నాలుగురోజుల తర్వాత గుర్తింపు

వేళచ్చేరి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): తంజావూరులోని ఓ ఇంట్లో తల్లీ, కొడుకుల మృతదేహాలను పోలీసులు గుర్తించారు. తంజావూరు మున్సిపాలిటీ కాలనీకి చెందిన మదన్‌గోపాల్,ఈశ్వరి (59) దంపతుల కుమారుడు మదన్‌రాహుల్ (29) ఇంజనీరింగ్ పూర్తిచేసి వ్యాపారం చేస్తున్నాడు. 15 ఏళ్ల క్రితం తండ్రి మృతిచెందడంతో, మదన్‌రాహుల్ తల్లితో కలసి ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో, నాలుగు రోజులుగా ఈశ్వరి ఇంటి తలుపులు తెరచుకోకపోవడంతో, వారు పొరుగూరికి వెళ్లుంటారని చుట్టుపక్కల వారు భావించారు. ఈ నేపథ్యంలో, మంగళవారం ఉదయం ఆ ఇంటికి పూలు ఇచ్చేందుకు వచ్చిన మహిళ, ఇంట్లో నుంచి దుర్గంధం రావడంతో తంజావూరు వైద్యకళాశాల ఆస్పత్రి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వెళ్లి తలుపులు బద్దలు కొట్టి లోపల చూడగా కిందపడిన ఉన్న ఈశ్వరి, సమీపంలో ఉరేసుకొని మదన్ రాహుల్ ఆత్మహత్యకు పాల్పడి ఉండడం గుర్తించారు. వీరు మృతిచెంది నాలుగు రోజులు అవడంతో మృతదేహాలు దెబ్బతిన్నాయి. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించిన పోలీసులు, మదన్ రాహుల్ రాసిన సూసైడ్ నోట్ స్వాధీనం చేసుకున్నారు. అందులో... నాలుగు రోజుల క్రితం తాను ఇంటికి రాగా బాత్రూమ్‌లో తల్లి ఈశ్వరి పడి ఉండడం గమనించానని, ఆమెను ఆస్పత్రికి తీసుకెళ్లాలనుకునేలోగా ఆమె మృతిచెందిందన్నారు. తండ్రి, తల్లీ లేక తాను ఎలా జీవించాలన్న మనస్తాపంతో తాను ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు మదన్‌గోపాల్ సూసైడ్ నోట్‌లో పేర్కొన్నాడు.

అర్ధరాత్రి కోయంబేడు వ్యాపారుల ధర్నా

వేళచ్చేరి, నవంబరు20(ఆంధ్రజ్యోతి): కోయంబేడు మార్కెట్ నిర్వాహకుల తీరును ఖండిస్తూ వ్యాపారులు అర్ధరాత్రి ధర్నా చేపట్టడంతో కలకలం రేపింది.ఈ మార్కెట్‌లో 7 నుంచి 14 గేట్లు మధ్యాహ్నం 2నుంచి రాత్రి 9గంటల వరకు మూసివేస్తున్నట్లు సమాచారం. ఈకారణంగా పొరుగు జిల్లాలు, రాష్ట్రాల నుంచి సరుకులు, కూరగాయలతో వచ్చే వాహ నాలు మార్కెట్లోకి వెళ్లలేక రోడ్డు పక్కనే నిలపడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. గేట్లు మూసివేస్తుండడంతో గంటల కొద్దీ వేచి ఉండాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని వ్యాపారులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో, మంగళవారం రాత్రి పది గంటల నుంచి వ్యాపారులు హఠాత్తుగా చేపట్టిన ఆందోళన అర్ధరాత్రి 2గంటల వరు సాగింది. సమాచారం అందుకున్న కోయంబేడు దుకాణాల నిర్వాహక ప్రిన్సిపల్ అధికారి ఇందుమతి, సీఎండీఏ నిర్వాహక ఇంజనీర్ రాజన్‌బాబు అక్కడకు చేరుకొని ఆందోళనకారులతో చర్చలు జరిపారు. మార్కెట్‌లో పేరుకుపోయిన కాయగూరలు, పండ్ల వ్యర్థాలను తొలగించేందుకు గేట్లు మూస్తున్నామని, గేట్లు మూయకపోతే శుభ్రం ఎలా చేస్తామని అధికారి ఇందుమతి వారిని ప్రశ్నించారు. ఇందుకు నిర్ణీత సమయం కేటాయించాలని వ్యాపారుల కోరికను పరిశీలిస్తామన్న అధికారుల హామీతో వారు ఆందోళన విరమించారు.

సిద్ధ వైద్యశిబిరానికి స్పందన

వేలూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వేలూరు కింగ్స్ రోటరీ సంఘం, వేలూరు సిద్ధ ఆయుర్వేద కేంద్రం, అగత్తియర్ సిద్ధ వైద్యశాల, జిల్లా కేంద్ర గ్రంథాలయం సంయుక్త ఆధ్వర్యంలో సిద్ధ వైద్యశిబిరం నిర్వహించారు. కేంద్ర గ్రంథాలయ ప్రాంగణంలో జరిగిన ఈ శిబిరంలో సిద్ధ వైద్యులు డా.లక్ష్మణన్, జలజ, బాలసుబ్రమణ్యన్, రోటరీ అధ్యక్షుడు నటన శింగారం, సెక్రటరీ మణికంఠన్, కోశాధికారి వినోద్‌కుమార్, సముదాయ పనుల డైరెక్టర్ బాలసుబ్రమణ్యన్, గ్రంథాలయ మహిళా శాఖ ఆర్గనైజర్ శశిరేఖ తదితరులు పాల్గొన్నారు. ఈ శిబిరంలో సుమారు 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, సుమారు రూ.25 వేల విలువైన మందులు ఉచితంగా అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు.



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ఘనంగా ప్రథమ వార్షికోత్సవం

తిరుత్తణి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్ జిల్లా పళ్లిపట్టు అంజనేయ నగర్‌లోని కల్యాణ రామ సమేత వీరమంగళ అంజనేయ ఆలయ ప్రథమ వార్షికోత్సవం వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా అర్చకులు రంజిత్‌శర్మ నేతృత్వంలో ఆంజనేయస్వామికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ, పూజలు నిర్వహించారు. ఈ వేడుకల్లో చుట్టుపక్కల ప్రాంతాల భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనగా, ఆలయ నిర్వాహకులు భక్తులకు ప్రసాదాలు అందజేశారు.

ఘనంగా బాలల దినోత్సవం

తిరుత్తణి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక సాయి మెట్రిక్యులేషన్ పాఠశాలలో బుధవారం బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దివంగత మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఛైర్మెన్ టీఎస్ఎం గురుమూర్తి, సీనియర్ ప్రిన్సిపాల్ కేసీ విజయకుమార్, వైస్ ప్రిన్సిపాల్ ఎంపీ లక్ష్మీనరసమ్మ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.



విజేతలతో నిర్వాహకులు

పాఠశాల మైదానంలోకి ఏనుగు

● పరుగులు తీసిన విద్యార్థులు



మైదానంలో సంచరిస్తున్న ఏనుగు

పెరంబూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లా పందలూరు, చుట్టుపక్కల గ్రామాల్లో కొద్దిరోజులుగా అడవి ఏనుగు సంచరిస్తోంది. ఆహారం కోసం ఇళ్లను ధ్వంసం చేస్తున్న ఏనుగు, సమీపంలోని పొలాల్లో కూడా తిరుగుతుండడంతో పంటలు దెబ్బతింటున్నాయి ఈ నేపథ్యంలో, నెలకోట గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల క్రీడా మైదానంలో మంగళవారం సాయంత్రం ఏనుగు ప్రవేశించింది. మైదానంలో ఆడుకుంటున్న విద్యార్థులు ఏనుగును చూసి పరుగులు తీశారు. కొందరు యువకులు మైదానంలోకి ఏనుగు రావడంతో సెల్‌ఫోన్లలో చిత్రీకరించారు. కొద్దిసేపు మైదానంలో తిరిగిన ఏనుగు, అనంతరం సమీపంలోని అటవీ ప్రాంతంలోకి వెళ్లింది.

స్టాన్లీలో ఆహార నాణ్యత పరిశీలన

పెరంబూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక స్టాన్లీ ఆస్పత్రిలో ఇన్‌పేషంట్లకు ఆహారం అందించే వంట గదుల సముదాయాలను ఆహార భద్రతా శాఖ అధికారులు మంగళవారం పరిశీలించారు. ఆస్పత్రి ప్రాంగణంలోని క్యాంటీన్ పరిశీలించిన అధికారులు, అక్కడ నిషేధ ప్లాస్టిక్ వస్తువులు వినియోగిస్తారా అని విచారించారు. అనంతరం రోగులు, వారి బంధువుల వద్ద ఆహార నాణ్యత గురించి ప్రశ్నించారు. ఈ విషయమై ఆహార భద్రతా శాఖ అధికారులు మాట్లాడుతూ.. ప్రభుత్వాస్పత్రుల్లో వైద్య విద్యార్థులు, రోగులకు నాణ్యమైన ఆహారం అందిస్తున్నారా అనే విషయమై రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వాసుపత్రుల్లో తనిఖీలు చేపట్టామన్నారు. స్టాన్లీ ఆసుపత్రిలో చేపట్టిన తనిఖీల అనంతరం 120కి 99 మార్కులు వేసామని తెలిపారు. ఆస్పత్రిలో ప్లాస్టిక్ వినియోగంతో పాటు కొన్ని చిన్న లోపాలున్నాయని అధికారులు తెలిపారు.

రాష్ట్రంలో అదనంగా 20 ఆవిన్ కేంద్రాలు

పెరంబూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అదనంగా 20 ఆవిన్ ఉత్పత్తి కేంద్రాలు ఏర్పాటుచేయనున్నట్లు పాల డైరీ, చేనేత శాఖ మంత్రి రాజ కన్నప్పన్ తెలిపారు. రామనాథపురంలో మంగళవారం జరిగిన సహకార సంఘాల వారోత్సవాల్లో పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ... రైతులు, స్వయం సహాయక బృందాలు, ఫుట్‌పాత్ వ్యాపారులు, చిరు వ్యాపారుల ఆర్థికాభివృద్ధి పెంచేలా సహకార శాఖ రుణాలు అందిస్తుందన్నారు. రాష్ట్రంలో ప్రైవేటు పాల ధర కన్నా రూ.12 తక్కువ ధరకు ఆవిన్ పాలు విక్రయిస్తున్నామన్నారు. ఆవిన్ పాలకు ఆదరణ లభిస్తోందని, త్వరలో అదనంగా 20 ఆవిన్ పాల ఉత్పత్తి కేంద్రాలు ప్రారంభించనున్నట్లు మంత్రి తెలిపారు.

టాస్మాక్ దుకాణానికి తాళం వేసి ఆందోళన

వేలూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక పాత బస్టాండ్‌లోని టాస్మాక్ దుకాణానికి వివిధ పార్టీల ఆధ్వర్యంలో తాళాలు వేసి ఆందోళన చేపట్టారు. ఆందోళనలో సీపీఎం, డీపీఐ, సీఐటీయూ, ఐద్వా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఆందోళనకు సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఏలుమలై నేతృత్వం వహించగా, కమిటీ సభ్యులు వాసుదేవన్, సతీష్, ఫాతిమా, మహేశ్వరి, మలర్, జిల్లా సెక్రటరీ సరోజ, మాణిక్యం, సింబుదేవన్, దశరథన్, సెంథిల్‌నాథన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో పాత్రికేయుడి దుర్మరణం

చెన్నైలో తెలుగు టీవీ కెమెరామేన్ మృతి ● మృతుడిది చిత్తూరు జిల్లా



ప్రదీప్ (ఫైల్‌ఫొటో)



ప్రమాదానికి కారణమైన కారు - నుజ్జునుజ్జయిన ప్రదీప్ బైక్

చెన్నై, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఓ తెలుగు చానల్‌లో కెమెరామెన్‌గా పని చేసే ఒ.ప్రదీప్ కుమార్ (39) రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. చెన్నైలో సొంతంగా యాట్యూబ్ ఛానల్ పెట్టుకున్న ఆయన.. అది కుటుంబ ఆర్థిక అవసరాల కోసం 'ర్యాపిడో' సంస్థలో బైక్ రైడర్‌గా కూడా పని చేస్తున్నారు. మంగళవారం అర్ధరాత్రి కస్టమర్ పిలవడంతో వెళ్లిన ప్రదీప్‌కుమార్.. అతడిని దింపి తాంబరం-మధురవాయల్ 200 ఫీట్ రోడ్డులో తాను నివాసం ఉంటున్న అంబత్తూరు వెళ్తుండగా, వెనుక నుంచి వచ్చిన కారు వేగంగా ఢీకొంది. దీంతో సర్వీసురోడ్డులో వందడుగుల దూరంలో ప్రదీప్ ఎగిరి పడ్డాడు. ప్రమాదం జరిగాక కిలోమీటర్ దూరం వెళ్లిన తరువాత కారు ఆగిపోయింది. ఘటన జరగ్గానే డ్రైవింగ్ చేసిన వ్యక్తి కారు అక్కడే వదిలేసి పారిపోయాడు. ఆ కారు వేలప్పన్‌చావడికి చెందిన ఓ పెద్ద పారిశ్రామికవేత్తదని పోలీసులు తెలిపారు. కాగా ప్రమాదంలో ప్రదీప్ మోటారు వాహనం నుజ్జునుజ్జయింది. ఆ మార్గంలో వెళ్తున్న వారు ఇచ్చిన సమాచారం మేరకు అక్కడకు చేరుకున్న పోలీసులు.. ప్రదీప్ కోసం సుమారు గంటన్నర సేపు వెతకాల్సివచ్చింది. చెట్ల పొదల్లో, రాళ్లపై రెండు కాళ్లు, చేతులు విరిగి ప్రదీప్ శరీరం పడివుంది. అప్పటికే అతడి ప్రాణాలు పోయినట్లు గుర్తించిన పోలీసులు.. భౌతికకాయానికి కేఎంసీ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి, సాయంత్రం కుటుంబీకులకు అప్పగించారు. ప్రదీప్ స్వస్థలం చిత్తూరు జిల్లా నగరి నియోజకవర్గం లక్ష్మీనరసింహ రాజువారి పాలెం. గురువారం అక్కడే ఆయన అంత్యక్రియలు జరుగనున్నాయి. ప్రదీప్‌కు భార్య, కుమార్తె వున్నారు. కాగా ప్రదీప్ మృతి పట్ల తెలుగు జర్నలిస్టుల సంఘం (తేజస్), చెన్నై ప్రెస్ క్లబ్ తీవ్ర సంతాపం ప్రకటించాయి. ప్రదీప్ కుటుంబానికి రూ.50 వేలు ఆర్థిక సాయం అందించనున్నట్లు తేజస్ ప్రధాన కార్యదర్శి గోటేటి వెంకటేశ్వరరావు, కోశాధికారి పి.నరసింహారావు తెలిపారు. అంతేగాక తోటి పాత్రికేయులు అందించే ఆర్థిక సాయాన్ని కూడా కలిపి ఆ కుటుంబానికి అందజేయనున్నట్లు వారు వివరించారు.

విద్యార్థినికి లైంగిక వేధింపులు

● టీచర్ అరెస్ట్

పెరంబూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఐదో తరగతి విద్యార్థినికి లైంగిక వేధింపులకు గురిచేసిన ఉపాధ్యాయుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. అరియలూరులో టీచర్‌గా పనిచేస్తున్న ఓ వ్యక్తి పదేళ్ల విద్యార్థినిపై ఈ నెల 7వ తేది లైంగిక వేధింపులకు పాల్పడినట్లు సమాచారం. మరుసటిరోజు మధ్యాహ్నం తన లంచ్ బాక్స్ స్టాఫ్ రూమ్‌లో ఉంచాలని ఆ విద్యార్థినికి చెప్పిన టీచర్ గదిలోకి విద్యార్థిని వెనుకగా వెళ్లి ఆమెపై మరోసారి లైంగిక వేధింపులకు పాల్పడి, ఈ విషయం ఎవరికైనా చెబితే చంపుతానని బెదిరించాడు. ఈ క్రమంలో, విద్యార్థిని ఛాతిపై గాయం ఉండడాన్ని గమనించిన తల్లి ఆమెను ప్రశ్నించడంతో, ఉపాధ్యాయుడి అఘాయిత్యం వెలుగులోకి వచ్చింది. బాధిత విద్యార్థిని తల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో, పోక్సో చట్టం కింద కేసు నమోదుచేసి పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి జైలుకు తరలించారు.

ఆన్‌లైన్ పేమెంట్ ద్వారా లంచం డిమాండ్

● మహిళా వీఏఓ సస్పెన్షన్

పెరంబూర్,నవంబరు20(ఆంధ్రజ్యోతి): గూగుల్ పే ద్వారా లంచం ఆశించిన మహిళా వీఏఓపై సస్పెన్షన్ వేటుపడింది. శివగంగ జిల్లా ఇనయాంగుడి సమీపం కీళనెట్టూర్ వీఏఓగా రాక్కు పనిచేస్తోంది. ఆమె దివ్యాంగురాలైన బాలిక తల్లికి పట్టా ఇచ్చేందుకు రూ.3 వేలు గూగుల్ పే ద్వారా లంచం స్వీకరించారు. వీఏఓ రాక్కుపై పలు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో, శివగంగ సబ్ కలెక్టర్ విజయకుమార్, ఇనయాంగుడి తహసీల్దార్ మురుగన్ విచారణ చేపట్టారు. విచారణలో వీఏఓ రాక్కుపై వచ్చిన ఆరోపణలు రుజువు కావడంతో, ఆమెను సస్పెండ్ చేయాలనే అధికారుల సిఫారసుతో కలెక్టర్ రాక్కును సస్పెండ్ చేశారు.

నలుగురు జాలర్లకు ఏడాది జైలు శిక్ష

● తీర్పుచెప్పిన లంక న్యాయస్థానం

పెరంబూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రామేశ్వరం జాలర్లు 12 మందిని విడుదల చేసిన శ్రీలంక కోర్టు, నలుగురు జాలర్లకు ఏడాది జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది. రామేశ్వరం నుంచి అక్టోబరు 23న జాలర్లు చేపల వేటకు వెళ్లారు. నెడుదీవి ప్రాంతంలో చేపలు పడుతున్న జాలర్లను చుట్టుముట్టిన శ్రీలంక నావికాదళం, సరిహద్దులు దాటి చేపలు పడుతున్నారని 16 మంది జాలర్లను అరెస్ట్ చేసింది. జాలర్ల రిమాండ్ ముగియడంతో వారిని బుధవారం కోర్టులో హాజరుపరిచారు. వారిలో 12 మంది జాలర్లను విడుదల చేసిన కోర్టు, రెండోసారి సరిహద్దులు దాటి చేపల వేటకు వచ్చారనే ఆరోపణలతో నలుగురు జాలర్లకు ఏడాది జైలు శిక్ష విధించింది. కాగా, సరిహద్దులు దాటారని శ్రీలంక నావికాళం స్వాధీనం చేసుకున్న 13 పడవలను లంక నావికాదళం వినియోగించుకోవచ్చని మరో కేసులో ఆ దేశ న్యాయస్థానం ఉత్తర్వులు జారీచేసింది.

బాంబు బెదిరింపులు... ముగ్గురు విద్యార్థుల డిస్మిస్

పెరంబూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్‌లోని ఓ ప్రైవేటు పాఠశాలకు బాంబు బెదిరింపులకు పాల్పడిన వ్యవహారంలో ముగ్గురు విద్యార్థులను డిస్మిస్ చేశారు. మూలపాళయంలోని మెట్రిక్ పాఠశాలకు ఈ నెల 12న ఈ-మెయిల్ ద్వారా బాంబు బెదిరింపు వచ్చింది. బాంబు బెదిరింపునకు పాల్పడింది ఆ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు అని పోలీసు విచారణలో తెలిసింది. దీంతో, ఈ చర్యకు పాల్పడిన 9వ తరగతి చదువుతున్న ముగ్గురు విద్యార్థులను డిస్మిస్ చేస్తూ పాఠశాల యాజమాన్యం చర్యలు చేపట్టింది.

నగరంలో మాదకద్రవ్యాల చలామణి

● ఎస్ఐ భర్త, కాంగ్రెస్ నేత సహా ఐదుగురి అరెస్ట్

పెరంబూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నగరంలో మెతాపెటామిన్ అనే మాదకద్రవ్యం తరలింపు కేసులో ఎస్ఐ భర్త, కాంగ్రెస్ నేత సహా ఐదుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక పాడి ఫ్లై ఓవర్‌పై తనిఖీలు చేపట్టిన ప్రత్యేక విభాగం పోలీసులు ఆ మార్గంగా వచ్చిన ఇద్దరిని అనుమానించి అదుపులోకి తీసుకున్నారు. వారి బ్యాగులు తనిఖీ చేయగా మెతాపెటాయిన్ అనే మాదకద్రవ్యం గుర్తించి స్వాధీనం చేసుకొని, ఇద్దరని పుళల్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించారు. వారిలో ఒకరు కుమరవేల్ అని, మాదకద్రవ్యాల తరలింపులో ప్రముఖ పాత్ర ఇతడిదేనని తెలిసింది. మద్రాసు హైకోర్టులో బందోబస్తులో ఉన్న వాషర్‌మెన్‌పేట పోలీస్‌స్టేషన్ ప్రత్యేక ఎస్ఐ విశాలాక్షి భర్త కుమరవేల్ అని గుర్తించారు. ఈ తరలింపునకు సంబంధించి తిరువేర్కాడు ఆర్ఎస్ పురం ప్రాంతానికి చెందిన సుభాష్, పుళల్ ప్రాంత కాంగ్రెస్ అధ్యక్షుడు పార్తీపన్, ఓటేరి ప్రాంతానిక చెందిన అమీర్‌భాషా, కావాంగరైకు చెందిన దీపక్‌లను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో నేపాల్ యువకుడి మృతి

వేళచ్చేరి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక సాలిగ్రామంలో విద్యుదాఘాతంతో నేపాల్‌కు చెందిన యువకుడు మృతిచెందాడు. సాలిగ్రామం అరుణాచలం వీధిలో ఉన్న హోటల్‌లో నేపాల్‌కు చెందిన ఆకాష్ (24) పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి హోటల్ మూసివేసిన తర్వాత పైపు పట్టుకుని నీటితో శుభ్రం చేస్తున్న సమయంలో, స్విచ్ బోర్డుపై నీరు పడడంతో, విద్యుత్ ప్రవహించి ఆకాష్ షాక్‌కు గురయ్యాడు. చుట్టుపక్కల వారు అతడిని వెంటనే కీల్పాక్కం ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అప్పటికే అతను మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై విరుగంబాక్కం పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

వృద్ధురాలి మెడలో నగల చోరీ

వేలూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక విరుదంబట్టు రాధాకృష్ణన్ నగర్ గాంధీ వీధికి చెందిన రామస్వామి రిటైర్డ్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు. ఈ నెల 17వ తేది రాత్రి 1.30 గంటల ప్రాంతంలో ఇంటి కాలింగ్ బెల్ మోగుతుండడంతో ఆయన భార్య మీనాక్షి (78) తలుపులు తీయగా, బయట నిలబడి వ్యక్తి ఆమె మెడలోని 6 సవర్ల నగలు లాక్కొని పరారయ్యాడు. ఈ విషయమై బాధితులు విరుదంబట్టు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఇంటి ప్రాంగణంలోని సీసీ ఫుటేజీ పరిశీలించి, ఇద్దరు వ్యక్తులు ఈ దోపిడీకి పాల్పడినట్లు నిర్ధారించారు. వారిలో ఒకరు మీనాక్షి ఇంటి పక్కనే ఉన్న కరణ్ (20), అదే ప్రాంతానికి చెందిన కుమార్ అని గుర్తించారు. వారిలో ఒకరిని అరెస్ట్ చేసిన పోలీసులు, నగలు స్వాధీనం చేసుకున్నారు.

'డిజిటల్ అరెస్టు' పేరిట రూ.3.5 కోట్ల వసూలు

● అస్సాం యువకుడి అరెస్టు

చెన్నై, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నగరంలోని తిరువాన్మియూరుకు చెందిన మాజీ ప్రభుత్వాధికారిని ముంబయి పోలీసుల పేరుతో బెదిరించి డిజిటల్ అరెస్టు చేసినట్లు భయపెట్టి రూ.88 లక్షలను కాజేసిన అస్సాం యువకుడు ప్రదీప్‌బోరాను సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేశారు. ఇటీవల మాజీ ప్రభుత్వాధికారి వాట్సప్ నెంబర్‌కు కాల్‌చేసిన ఓ వ్యక్తి ముంబయి పోలీసుస్టేషన్‌ను నుండి మాట్లాడుతున్నామని, ఆ అధికారిపై క్రిమినల్ కేసు నమోదు కావటంతో డిజిటల్ అరెస్టు చేశామని, ఆ కేసు నుండి విడిపించాలంటే రూ.88లక్షలు చెల్లించాలన్నాడు. ఆ అధికారి ఆ మాటలను నమ్మి ఆ వ్యక్తి చెప్పిన బ్యాంక్ ఖాతాకు నగదు బదిలీచేశాడు. ఫోన్ చేసిన వ్యక్తి చెప్పినట్లు రెండు రోజుల తర్వాత ముంబయి పోలీసుల నుంచి ఎలాంటి రశీదు రాకపోవటంతో ఆ మాజీ ప్రభుత్వాధికారి సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు రంగంలోకి దిగి నగదు బదిలీ అయిన బ్యాంక్ ఖాతా వివరాల ఆధారంగా అసోంకు చెందిన ప్రదీప్‌బోత్రా (38) అనే యువకుడిని అరెస్టు చేశారు. అతడిని ప్రశ్నించినప్పుడు ఇదే విధంగా నలుగురిని బెదిరించి రూ.3.5 కోట్ల మేరకు వసూలు చేసి మోసగించినట్లు కనుగొన్నారు.

గర్భం దాల్చిన ప్లస్ టూ విద్యార్థిని

పెరంబూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూర్ సమీపంలోని ఓ పాఠశాలలో ప్లస్ టూ చదువుతున్న విద్యార్థిని 8 నెలల గర్భంతో ఉన్నట్లు సమాచారం. ఈ విషయం తెలుసుకున్న ఉపాధ్యాయులు ఆ విద్యార్థిని తల్లిదండ్రులను పిలిపించి ఈ నెల 12న టీసీ ఇచ్చి పంపారు. ఈ విషయమై మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు అందింది. 8 నెలల గర్భంతో ఉన్నా ఉపాధ్యాయులకు ఎందుకు తెలియలేదు? హఠాత్తుగా టీసీ ఎందుకు ఇచ్చి పంపించారు? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

అలాంటి పాత్రలు వద్దు

● మీనాక్షి చౌదరి



విజయ్, విజయ్ ఆంటోనీ, ఆర్జే.బాలాజీ, దుల్కర్ సల్మాన్ వంటి స్టార్ హీరోల చిత్రాల్లో నటించిన యంగ్ హీరోయిన్ మీనాక్షి చౌదరి ఇపుడు ఓ షాకింగ్ నిర్ణయం తీసుకుంది. ఇకపై భార్యపాత్రల్లో నటించనని స్పష్టం చేసింది. విజయ్ 'ది గోట్', విజయ్ ఆంటోనీ 'కొలై', ఆర్జే బాలాజీతో 'సింగపూర్ సలూన్' వంటి చిత్రాల్లో నటించిన మీనాక్షి చౌదరి... తాజాగా దుల్కర్ సల్మాన్ నటించిన 'లక్కీ భాస్కర్' చిత్రంలో నటించారు. ఇందులో హీరో భార్యగా, ఓ బిడ్డకు తల్లిగా నటించారు. ఆమె నటించిన చిత్రాలన్నీ విజయం సాధిస్తుండటంతో ఇకపై నటించనున్న చిత్రాలకు ఒక నిబంధన విధించారు. ఈ విషయంపై ఆమె స్పందిస్తూ, 'నేను నటించిన చిత్రాల్లో ఎక్కువ భాగం భార్య పాత్రల్లోనే కనిపించాను. 'లక్కీ భాస్కర్'లోని తల్లి పాత్రకు మంచి ప్రశంసలు వచ్చాయి. కానీ చాలా మంది ఈ తరహా పాత్రలు పోషించవద్దని సలహా ఇస్తున్నారు. భార్య పాత్రలను పోషించేందుకు చాలా సమయం ఉందని సూచించారు. అందుకే ఇకపై నటించే సినిమాల్లో ఈ తరహా పాత్రల్లో నటించరాదని నిర్ణయం తీసుకున్నాను. ఇపుడు ఓ యాక్షన్ భరిత మూవీలో పోలీస్ ఆఫీసర్‌గా నటిస్తున్నాను' అని పేర్కొన్నారు.

భూమిపై అందరూ అతిథులమే..

ఏదీ సొంతం కాదు

'పరారీ' దర్శకుడు ఎళిల్ పెరియవేది

మనమంతా ఈ భూమిపై అతిథులమేనని, ఇక్కడ ఉండేది ఏదీ మనకు సొంతం కాదని, దేహాన్ని వదిలి వెళ్ళేలోపు ఏదో ఒక మంచి చేయాలన్న కాన్సెప్ట్‌తో తెరకెక్కించిన చిత్రమే 'పరారీ' అని ఆ చిత్ర దర్శకుడు ఎళిల్ పెరియవేది అన్నారు. శుక్రవారం విడుదల కానున్న నేపథ్యంలో చిత్ర బృందం మీడియాతో ముచ్చటించింది. నిర్మాత నటుడు హరి మాట్లాడుతూ, 'ఈ మూవీ మేమంతా కలిసి చేసిన చిన్న ప్రయత్నం. మీడియా సపోర్టు చేయాలి' అని కోరారు. నటి సంగీత మాట్లాడుతూ, 'ఇది నా తొలి చిత్రం. మా అందరి కష్టాన్ని గుర్తిస్తారని నమ్ముతున్నాను. ప్రతి ఒక్కరికీ ఆమె ధన్యవాదాలు తెలిపారు. దర్శకుడు, నిర్మాత రాజు మురుగన్ మాట్లాడుతూ, 'నా వద్ద అసిస్టెంట్‌గా పనిచేసిన ఎళిల్ ఈ చిత్రానికి దర్శకుడు. సమాజ బాధ్యతతో తెరకెక్కించారు. ప్రతి ఒక్కరూ ఆదరించాలి' అని కోరారు. చిత్ర దర్శకుడు ఎళిల్ మాట్లాడుతూ, 'అనేక మంది నిర్మాతలకు స్టోరీ వినిపించాను. ప్రతి ఒక్కరూ బాగానే ఉందనేవారు. కానీ ఎందుకో వెనక్కి తగ్గేవారు. నా బాధను అర్థం చేసుకున్న రాజు మురుగన్ చొరవ తీసుకుని, నిర్మాత, నటుడు హరిని ఈ ప్రాజెక్టులోకి తీసుకొచ్చారు. సినిమా కోసం హరి బరువు బాగా తగ్గాడు. తిరువణ్ణామలై వాసులను ఈ సినిమాలో నటించేలా ఒప్పించాం. విజువల్ కమ్యూనికేషన్‌లో పీహెచ్‌డీ పూర్తి చేసిన వారు ఈ సినిమాకు పనిచేశారు. షూటింగుకు కొన్ని నెలల ముందు రిహార్సల్ చేశాం. ప్రతి నటుడు, టెక్నీషియన్ చాలా కష్టపడ్డారు. ఇది నా చిత్రం కాదు. రాజు మురుగన్ చిత్రం. మనమంతా ఈ భూమిని వదిలి వెళ్ళేలోగా ఒక మంచి విషయాన్ని చెప్పాలన్నదే 'పరారీ' ప్రధాన లక్ష్యం. ప్రతి ఒక్కరికీ నచ్చుతుందని భావిస్తున్నాను' అని పేర్కొన్నారు.



'పరారీ' చిత్ర బృందం

చిత్రజ్యోతి

'పార్కింగ్' డైరెక్టర్‌తో 'చియాన్'


విక్రమ్ - రామ్‌కుమార్ బాలకృష్ణన్

'పార్కింగ్' వంటి హిట్ చిత్రాన్ని అందించిన యువ దర్శకుడు రామ్‌కుమార్ బాలకృష్ణన్ దర్శకత్వంలో చియాన్ విక్రమ్ నటించనున్నట్టు సమాచారం. హరీష్ కళ్యాణ్ - ఎంఎస్ భాస్కర్ ప్రధాన పాత్రలు పోషించిన ఈ చిత్రానికి ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. ప్రతి ఒక్కరూ ఎదుర్కొనే 'పార్కింగ్' అనే కామన్ పాయింట్ తీసుకుని ప్రతి ఒక్కరికీ కనెక్ట్ అయ్యేలా ఈ చిత్రాన్ని దర్శకుడు తెరకెక్కించారు. సూపర్ హిట్ కావడంతో నిర్మాతకు లాభాల పంట పండించింది. 'పార్కింగ్' తర్వాత ఫ్యాషన్ స్టూడియోస్‌లో ఒక చిత్రం చేయనున్నారు. ఆ తర్వాత శివకార్తికేయన్ హీరోగా నటించే చిత్రానికి డైరెక్ట్ చేశారు. మరోవైపు, చియాన్ విక్రమ్‌ను కలిసి ఓ స్టోరీ వినిపించారు. ఆ కథకు ఇంప్రెస్ అయిన చియాన్... అతనితో కలిసి పనిచేసేందుకు అంగీకరించినట్టు కోలీవుడ్ వర్గాలు పేర్కొంటున్నాయి.

హీరోయిన్లకు పేరరసు అడ్వైజ్

● 'లారా' చిత్ర ట్రైలర్ రిలీజ్

చిత్రపరిశ్రమలో నిలదొక్కుకున్న తర్వాత హీరోయిన్లు ఒకేసారి పారితోషికాన్ని పెంచేస్తున్నారని, అలా చేయకూడదని సీనియర్ దర్శకుడు, తమిళ సినీ దర్శకులు సంఘం ప్రధాన కార్యదర్శి పేరరసు సలహా ఇచ్చారు. కారైక్కాల్‌లో జరిగిన యదార్థ సంఘటన ఆధారంగా రూపొందించిన చిత్రం 'లారా'. మణి మూర్తి దర్శకుడు. ఎంకే ఫిలిమ్ వర్క్స్ పతాకంపై కార్తికేశన్ నిర్మించారు. 'మురుగా', 'పిడిచ్చిరుక్కు' చిత్రాల ఫేం అశోక్ కుమార్ హీరోగా నటించగా, అనుశ్రేయ రాజన్ హీరోయిన్. ఇతర పాత్రల్లో మేథ్యూ వర్గీస్, వర్షిణి, వెణ్మతి, నిర్మాత కార్తికేశన్ ప్రధాన పాత్రలు పోషించారు. ఆర్జే రవీనా ఛాయాగ్రహణం అందించగా, రఘు ఈశ్వరన్ కుమార్ సంగీతం. ఈ సినిమా ట్రైలర్, ఆడియో రిలీజ్ మంగళవారం రాత్రి నగరంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తమిళ సినీ దర్శకులు సంఘం అధ్యక్షుడు ఆర్‌బీ ఉదయకుమార్, కార్యదర్శి పేరరసు ముఖ్యఅతిథులుగా హాజరై ఆడియో రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా పేరరసు మాట్లాడుతూ, 'హీరోయిన్లకు ఒకటి రెండు చిత్రాల్లో నటించిన తర్వాత తమ రెమ్యునరేషన్‌ను ఒకేసారి పెంచొద్దని కోరారు. దర్శకుడు మణి మూర్తి మాట్లాడుతూ, 'ఇందులో నటించిన నటీనటులు, పనిచేసిన టెక్నీషియన్లు లగ్జరీ సౌకర్యాలు ఆశించకుండా, పూర్తి సహాయ సహకారాలు అందించడం వల్లే అనుకున్న సమయంలో చిత్రీకరణ పూర్తి చేశాం. నా పనిని సమర్థవంతంగా చేశానని భావిస్తున్నాను. మీడియా, ప్రేక్షకులు ఆదరించాలని కోరుతున్నా' అన్నారు. హీరో అశోక్ కుమార్ మాట్లాడుతూ, 'ఒక మంచి చిత్రంలో నటించినందుకు సంతోషంగా ఉంది. ఇది ఒక ఇన్వెస్టిగేషన్ క్రైమ్ థ్రిల్లర్. ఇందులో పలువురు కొత్తవారున్నప్పటికీ వారంతా ఎంతో అనుభవం ఉన్నవారిలాగే నటించారు. మీడియా సపోర్టు చేయాలని కోరుతున్నాం' అని పేర్కొన్నారు.


'లారా' చిత్రం ప్రీరిలీజ్ ఈవెంట్

ఏంజల్ చిత్రం వ్యవహారం...

ఉదయనిధికి వ్యతిరేకంగా కేసు తోసివేత

వేళచ్చేరి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి కి వ్యతిరేకంగా ఓఎస్‌టీ ఫిల్మ్స్ సంస్థ యజమాని రామశరవణన్ దాఖలుచేసిన కేసును మద్రాసు హైకోర్టు తోసిపుచ్చింది. ఈ మేరకు రామశరవణన్ హైకోర్టులో దాఖలుచేసిన పిటిషన్‌లో... ఉదయనిధి కథానాయకుడిగా ఆనంది, పాయల్‌రాజ్‌పుత్, యోగిబాబు నటీనటులుగా డైరెక్టర్ కేఎస్ అదియమాన్ దర్శకత్వంలో 'ఏంజల్' చిత్రం తీయాలని నిర్ణయించామన్నారు. 2018లో ఈ చిత్రం షూటింగ్ ప్రారంభించి 80 శాతం పూర్తిచేశామన్నారు. కానీ, అంతలోనే 'మామన్నన్' చిత్రంలో నటించిన ఉదయనిధి, అదే తన చివరి చిత్రమని ప్రకటించారని వివరించారు. ఇప్పటివరకు ఈ చిత్రం నిర్మాణానికి రూ.13 కోట్లు వెచ్చించగా, 8 రోజులు కాల్షీట్లు ఇచ్చేందుకు ఉదయనిధి నిరాకరిస్తున్నారని పేర్కొన్నారు. ఈ చిత్రాన్ని ఉదయనిధి పూర్తిచేయాలి, నష్టపరిహారంగా రూ.25 కోట్లు చెల్లించేలా ఉత్తర్వులు జారీచేయాలని పిటిషన్‌లో కోరారు. ఈ కేసు నిరాకరించాలంటూ ఉదయనిధి తరపున హైకోర్టులో పిటిషన్ వేశారు. అలాగే, ఆలస్యంగా పిటిషన్ వేయడం జరిగిందని, అయినా ఈ కేసు నిరాకరించాలని ఉదయనిధి కోరారు. ఈ పిటిషన్ బుధవారం విచారించిన న్యాయమూర్తి టీకారామన్... ఓఎస్‌టీ ఫిల్మ్స్ సంస్థ యజమాని రామశరవణన్ పిటిషన్ తోసిపుచ్చుతున్నట్లు ఉత్తర్వులు జారీచేశారు.

చెంబేడు ఆలయానికి కొత్త విగ్రహాలు


అగస్తీశ్వరర్ విగ్రహాన్ని స్వీకరిస్తున్న ఆలయ నిర్వాహకులు

చెన్నై, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లాలోని చెంబేడులోని అరుళ్మిగు మంగళాంబికై సమేత అగస్తీశ్వరాలయంలో ప్రతిష్ఠించేందుకు అంతమైన అగస్తీశ్వరర్, లోపాముద్ర విగ్రహాలను చెన్నైకి చెందిన జగన్మోహనరావు అనే భక్తుడు కానుకగా సమర్పించారు. ఆ ఆలయం వద్ద ఏర్పాటైన ప్రత్యేక కార్యక్రమంలో గ్రామస్తులతోపాటు పూందమల్లి శాసనసభ్యుడు ఎ.కృష్ణస్వామి ఆ విగ్రహాలను ఆలయ నిర్వాహకులకు అందజేశారు. ఈ విగ్రహాల ప్రతిష్ఠాపన ఈ నెల 28న జరుగుతుందని ఆలయ నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వాదవూరు అడిగళార్, జనకళ్యాణ్ సుబ్రమణియన్ సూర్య ప్రకాష్, మారి గోవిందమ్మ తదితరులు పాల్గొన్నారు.

కూటమిపై విజయ్‌ని ప్రశ్నించండి

● డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత



వేళచ్చేరి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కూటమిపై విజయ్‌ను ప్రశ్నించాలని డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత మీడియాకు సూచించారు. కళ్లకుర్చి పార్టీ నిర్వాహకుడి ఇంటి వివాహ వేడుకల్లో పాల్గొన్న ప్రేమలత మీడియాతో మాట్లాడుతూ.. అన్నాడీఎంకేతో టీవీకే పొత్తు కుదుర్చుకుంటుందా అనే ప్రశ్నకు విజయ్‌ను అడగాలని సూచించారు. అన్నాడీఎంకే నేతృత్వంలో బలమైన కూటమి ఏర్పాటవుతుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల తేది ప్రకటించిన తర్వాత తాము పోటీచేసే స్థానాలు ప్రకటిస్తామని తెలిపారు. తమిళనాడుకు ముఖ్యమైన భాష తమిళమని, వేరే ఏ భాషను నిర్బంధించలేదన్నారు. అవాకులు చెవాకులు మాట్లాడుతుంది అనే తమిళ సామెత తెలియక మాట్లాడిన కస్తూరి పెద్ద చిక్కులు ఎదురుచూసిందన్నారు. అదే సమయంలో ఎందరో నేతలు మహిళల గురించి నీచంగా మాట్లాడారని, మరి వారిని ఎందుకు అరెస్ట్ చేయలేదని ప్రశ్నించారు. హైదరాబాద్ వెళ్లి కస్తూరిని పోలీసులు అరెస్ట్ చేయడం అన్యాయమని ప్రేమలత పేర్కొన్నారు.

'కావేరి' ఆధ్వర్యంలో ఇళ్లవద్దే వృద్ధులకు వైద్య పరీక్షలు



వృద్ధులకు వైద్యపరీక్షలు చేసే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ వీఎస్ నటరాజన్

చెన్నై, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆళ్వార్‌పేట కావేరి హాస్పిటల్ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం వృద్ధులకు ఇళ్లవద్దే వైద్య పరీక్షలు నిర్వహించే ప్రత్యేక కార్యక్రమం ప్రారంభమైంది. డాక్టర్ వీఎస్ నటరాజన్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ వీఎస్ నటరాజన్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసీజీ, మూత్రం, రక్తపరీక్షలు వంటివి ఇళ్లవద్దకే వెళ్ళి వైద్యులు పరీక్షిస్తారని కావేరి హాస్పిటల్స్ గ్రూపు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ అరవిందన్ సెల్వరాజ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ మహేష్‌కుమార్, డాక్టర్ అశ్విన్ సుబ్రమణియం, డాక్టర్ సుస్మిత, డాక్టర్ వెంకిట సురేష్, డాక్టర్ యామిని కన్నప్పన్, డాక్టర్ కవిత సుందరవదనం తదితరులు పాల్గొన్నారు.

24న సుద్దాల అశోక్ తేజ ఉపన్యాసం

చెన్నై, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): 'వేద విజ్ఞన వేదిక' ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీ ప్రముఖ కవి, ఉత్తమ జాతీయ గేయ రచయిత డాక్టర్ సుద్దాల అశోక్‌తేజ ఉపన్యాస కార్యక్రమం జరగనుంది. 'తరతరాల తెలుగు కవిత' ఉపన్యాస ధారావాహిక కార్యక్రమంలో భాగంగా 'శ్రీ శూద్ర గంగ - కావ్య పఠనం' అనే అంశంపై అశోక్‌తేజ ప్రసంగించనున్నారు. టి.నగర్ విజయరాఘవరోడ్డులో వున్న ఆంధ్రా క్లబ్‌లో ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు జరగనున్న ఈ కార్యక్రమానికి సాహితీ ప్రియులందరూ ఆహ్వానితులేనని సంస్థ అధ్యక్షులు జేకే రెడ్డి, కార్యదర్శి కందనూరు మధు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

ఉత్సాహంగా క్రిస్మస్ కేక్ మిక్సింగ్

● వెల్‌కమ్ హోటల్ కెన్సెస్ ఫాం బీచ్‌లో సందడి


కేక్ మిక్సింగ్‌లో చెఫ్‌లతో కెన్సెస్ గ్రూప్ సీఈఓ ఎం.కృష్ణ

ప్యారీస్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని వినియోగదారులకు సంతృప్తికరమైన, రుచికరమైన వంటకాలతో పాటు కేక్ అందించేందుకు మహాబలిపురంలోని వెల్‌కమ్ హోటల్ కెన్సెస్ ఫాం బీచ్ అధినేత కె.నరసారెడ్డి ప్రత్యేక సదుపాయాలు కల్పించారు. ఈస్ట్ కోస్ట్ రోడ్డులోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన మహాబలిపురంలో హోటల్ ప్రాంగణంలోని సముద్రతీరంలో నూతనంగా ప్రారంభించిన 'నమ్మ షాక్ బీచ్' రెస్టారెంట్లో బుధవారం సాయంత్రం కెన్సెస్ సీఈఓ ఎం.కృష్ణ సారథ్యంలో క్రిస్మక్ కేక్ మిక్సింగ్ జరిగింది. ఎగ్జిక్యూటివ్ చెఫ్ సబూజ్‌పాల్ సహా 30 మంది చెఫ్‌లు, సెలబ్రిటీలు విదేశీ పర్యాటకులు కలసి పలురకాల డ్రైఫ్రూట్స్, 35 లీటర్ల వైన్, బ్రాంది, రమ్‌తో ఉత్సాహంగా కేక్ మిక్సింగ్ చేశారు. ఈ మిశ్రమాన్ని 30 రోజులు నానబెట్టి క్రిస్మస్ ముందు విదేశీస్థాయిలో రుచికరమైన కేక్ తయారుచేసి హోటల్‌కు వచ్చే కస్టమర్లకు అందిస్తారు. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్ వీరేంద్ర తాపా, హోటల్ సిబ్బంది తదితరులు శాంతాక్లాజ్ వేషధారణలో సందడి చేశారు. ఈ సందర్భంగా సీఈఓ ఎం.కృష్ణ మాట్లాడుతూ... క్రిస్మస్, 2025 నూతన సంవత్సర వేడుకలను కోలాహలంగా జరుపుకొనేందుకు కస్టమర్లను ఆకర్షించేందుకు భారీస్థాయిలో సదుపాయాలు సమకూర్చుతున్నట్లు తెలిపారు.

దాంపత్య జీవితంలో షష్ఠిపూర్తి మహోన్నతం

ప్యారీస్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): దాంపత్య జీవితంలో షష్ఠిపూర్తి జరుపుకోవడం అరుదైన సంఘటన అని పలువురు పెద్దలు అభినందించారు. జై సరస్వతి ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్, పర్‌ఫెక్ట్ బేరింగ్ సంస్థ అధినేత పొన్నూరి కృష్ణారావు షష్ఠిపూర్తి మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక పురుషవాక్కంలోని ఫంక్షన్‌హాల్‌లో మంగళ, బుధవారాల్లో రెండురోజుల పాటు పీవీ కృష్ణారావు-మణిమాలరావులకు దీర్ఘాయుష్ ప్రసాదించాలని కోరుతూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపతి హోమం, ఆయుష్ హోమం, నవగ్రహ హోమం, సరస్వతి, లక్ష్మి, మహావిష్ణు హోమాలు, కలశ స్థాపన, స్వర్ణ మాంగల్యధారణ కార్యక్రమాలను చేశారు. ఈ వేడుకలకు హిందూ దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్ బాబు, మద్రాసు హైకోర్టు సీనియర్ న్యాయవాది శ్రీనివాసమూర్తి, డా.కనిగెలుపుల శంకరరావు, తెలుగు ప్రముఖులు, తెలుగు తరుణి మహిళా నిర్వాహకులు, పారిశ్రామికవేత్తలు, వైశ్య ప్రముఖులు పెద్దసంఖ్యలో హాజరై దంపతులను ఆశీర్వదించారు. కుటుంబ సభ్యులు డా.హారిక, తేజారావులు ఆహూతులను సత్కరించారు.


పీవీ కృష్ణారావు-మణిమాలరావు దంపతులను ఆశీర్వదిస్తున్న మంత్రి పీకే శేఖర్‌బాబు

కేరళకు ఎన్‌ఎల్‌సీ

రూ. కోటి విరాళం


పినరయి విజయన్‌కు చెక్కు అందజేస్తున్న ప్రసన్నకుమార్

చెన్నై, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఇటీవల విపత్తులతో తీవ్రంగా నష్టపోయిన కేరళను ఆదుకునేందుకు నైవేలి లిగ్నైట్ కార్పొరేషన్ (ఎన్‌ఎల్‌సీ) ముందుకొచ్చింది. ఆ రాష్ట్రంలో సహాయ చర్యల కోసం రూ. కోటి విరాళం అందజేసింది. ఈ మేరకు ఎన్‌ఎల్‌సీ చైర్మన్ మోటుపల్లి ప్రసన్నకుమార్ మంగళవారం తిరువనంతపురం వెళ్లి కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌కు చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎల్‌సీఐఎల్ డైరెక్టర్ ఎం.వెంకటాచలం, తమిళనాడు పవర్ లిమిటెడ్ (ఎన్‌టీపీఎల్) సీఈవో ఆనంద రామానుజం తదితరులు పాల్గొన్నారు.



చెన్నై వేప్పేరిలోని వెటర్నరీ యూనివర్సిటీలో జరిగిన 24వ స్నాతకోత్సవంలో పట్టాలు అందుకున్న విద్యార్థులతో గవర్నర్ ఆర్‌ఎన్ రవి తదితర ప్రముఖులు


చెన్నైలోని సవిత యూనివర్సిటీ వేడుకల్లో ఆహార రంగంలో విశిష్టసేవలందిస్తున్న వేలూరుకు చెందిన డార్లింగ్ గ్రూప్ చైర్మెన్ వెంకటసుబ్బుకు జీవితసాఫల్య పురస్కారం ప్రధానం చేస్తున్న వర్సిటీ వ్యవస్థాపకులు డా.వీరప్పన్


ఖతార్‌లో జరిగిన మోటారు రేస్‌లో రజత, కాంస్యపతకాలు సాధించిన జెఫ్రీ ఇమ్మానువేల్‌కు బుధవారం చెన్నైలోని తన కార్యాలయంలో రూ.లక్ష నగదును కానుకగా అందజేస్తున్న ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి


చెన్నై ప్యారీస్‌కార్నర్ కాళికాంబాళ్ ఆలయంలో రథం కోసం ఆ ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ ఈఎంఎస్ మోహన్ ఆచారికి 90 కేజీల వెండి కడ్డీలను అందజేస్తున్న దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు

తీర ప్రాంతాల్లో 'సీ విజిల్' విన్యాసాలు

● రాష్ట్రంలో ముందస్తు ఉగ్రవాద నిరోధక చర్యలు


చెన్నై కోవళం వద్ద నేవీ అధికారులతో కలిసి గస్తీ పడవలో 'సీ విజిల్'కు సిద్ధమవుతున్న మెరైన్ పోలీసులు

చెన్నై, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): భారత నావికాదళం, రాష్ట్ర సముద్రతీర భద్రతా దళం పోలీసులు సంయుక్తంగా బుధవారం నుంచి సముద్రతీర ప్రాంతాల్లో 'సీ విజిల్' పేరుతో నిర్వహించిన ఉగ్రవాద నిరోధక చర్యలకు సంబంధించిన విన్యాసాలు గగుర్పాటు కలిగించాయి. ఉగ్రవాదుల వేషాల్లో ఉన్నవారిని, పట్టుకోవడానికి సాయుధులైన నావికదళం, సముద్రతీర భద్రతా విభాగం పోలీసులు సాంకేతిక పద్ధతులతో మెషిన్‌గన్లు, ఏకే -47 తుపాకులతో తీవ్రవాదుల స్థావరాలపై, వారు నడుపుతున్న నాటుపడవలపై జరిపిన దాడులును చూసిన జాలర్లు, స్థానికులు విస్తుపోయారు. ముంబయి నగరంలో 2008లో సముద్రమార్గంలో ఉగ్రవాదులు చొరబడి జరిపిన విధ్వంసం మళ్ళీ పునరావృతం కాకుండా ప్రతియేటా భారత నావికాదళం ఆయా రాష్ట్రాలకు చెందిన సముద్రతీర భద్రతాదళం సిబ్బందితో కలిసి ఆపరేషన్ సురక్ష, అపరేషన్ ఆమ్లా, సాగర్ కవచ్, సీ విజిల్ వంటి పేర్లతో ఉగ్రవాద చొరబాటు ముందస్తు నిరోధక విన్యాసాలు నిర్వహిస్తోంది. ఆ మేరకు రాష్ట్రంలో బుధవారం ఉదయం రెండు రోజుల 'సీ విజిల్' విన్యాసాలు ప్రారంభమయ్యాయి. అందులో నావికాదళం సభ్యులే కాకుండా 2 వేలమంది విద్యార్థులు, ఎన్‌సీసీ క్యాడెట్లు స్కౌట్లు, స్థానిక జాలర్లు కూడా పాల్గొన్నారు. ఈ విన్యాసాల్లో మత్స్యశాఖ, అటవీ శాఖ, కస్టమ్స్, సీఐఎస్‌ఎఫ్, ఆర్పీఎఫ్ సభ్యులు కూడా పాలుపంచుకోవటం విశేషం. రాష్ట్రంలోని సముద్రతీర ప్రాంతాల్లోనే కాకుండా పుదుచ్చేరి తీర ప్రాంతాల్లోనూ ఒకే సమయంలో ఈ విన్యాసాలు నిర్వహించారు. చెన్నై మెరీనాబీచ్ నుంచి కన్నియాకుమారి తీరం వరకూ ఈ విన్యాసాలు గురువారం మధ్యాహ్నం వరకూ కొనసాగనున్నాయి. చెంగల్పట్టు జిల్లాలో కోవళం, మహాబలిపురం, కల్పాక్కం తదితర సముద్రతీ ప్రాంతాల వద్ద ఉగ్రవాదులను నిర్బంధించే విన్యాసాలు, ఉగ్రవాదుల స్థావరాలపై దాడులు జరిపే విన్యాసాలు, వాహనాల్లో పారిపోతున్న ఉగ్రవాదులను నిర్బంధించడం వంటి విన్యాసాలు జరిపారు. వాటిని చూసి స్థానిక ప్రజలు ఎవరూ భయపడనవసరం లేదని చెంగల్పట్టు జిల్లా కలెక్టర్ అరుణ్‌రాజ్ ప్రకటన కూడా చేశారు. ఇదేవిధంగా కడలూరు, రామనాథపురం, నాగపట్టినం, తూత్తుకుడి తదితర సముద్రతీర ప్రాంతాల్లోనూ ఈ విన్యాసాలు నిర్వహించారు.


గస్తీ నౌకలో ఉగ్రవాదులను పట్టుకునే విధానాన్ని వివరిస్తున్న నేవీ అధికారి



ఆగమోక్తంగా అంగుళీ సంధాన సంప్రోక్షణం

శ్రీవారి ఆలయంలో బుధవారం సీతాలక్ష్మణ సమేత శ్రీరామచంద్రమూర్తి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. 2021లో శ్రీరాముని విగ్రహంలో ఎడమచేయి మధ్య వేలిభాగంలో చిన్నపాటి భిన్నం ఏర్పడింది. అప్పట్లో దీనికి బంగారు కవచాన్ని తొడిగి సవరించారు. సాధారణంగా ఇలాంటివి జరిగితే 12 ఏళ్లకోసారి సంప్రోక్షణం చేయడం ఆనవాయితీ. 2018లో టీటీడీ ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. మళ్లీ 2030లోనే సంప్రోక్షణ జరగాల్సి ఉంది. కానీ విగ్రహానికి జరిగిన లోపాన్ని సవరించేందుకు అప్పటివరకూ వేచిఉండకుండా ముందుగానే చేపట్టాలని జీయర్‌స్వాములు, ఆగమ సలహాదారులు, అర్చకుల కమిటీ సూచించింది. వారి సలహామేరకు మంగళ, బుధవారాల్లో అంగుళీ సంధాన సంప్రోక్షణను ఆగమోక్తంగా నిర్వహించారు. బుధవారం హోమం నిర్వహించారు. జీయర్ స్వామి సమక్షంలో వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య ప్రధాన అర్చకులు వేణుగోపాల దీక్షితులు, కృష్ణశేషాచల దీక్షితులు, గోవిందరాజ దీక్షితులు పూజలు చేశారు.

- తిరుమల(ఆంధ్రజ్యోతి)



జిల్లాకు ఆరుగురు డీఎస్పీల రాక

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 20(ఆంధ్రజ్యోతి): డీఎస్పీల బదిలీల్లో భాగంగా ఉమ్మడి చిత్తూరు జిల్లాకు ఆరుగురిని నియమిస్తూ డీజీపీ ద్వారకా తిరుమలరావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. జె.రాంబాబును చిత్తూరు జిల్లా పోలీసు శిక్షణ కళాశాలకు, షేక్ బజీజాన్ సైదాను చిత్తూరు 8వ బెటాలియన్ డీఎస్పీగా, వి.శ్రీనివాసరెడ్డిని ఎర్రచందనం టాస్క్‌ఫోర్సుకు, జీవీ కృష్ణారావును చిత్తూరు 8వ బెటాలియన్‌కు, విజయానంద్‌ను వెంకటగిరిలోని 9వ బెటాలియన్‌కు, షరీఫ్‌ను తిరుపతిలోని ఎర్రచందనం టాస్క్‌ఫోర్సుకు నియమించారు. త్వరలో వారికి కేటాయించిన స్థానాల్లో చేరాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



తెల్లావారకముందే.. పల్లె లేచింది!















పల్లె అందాలు పనిపాటలతో పెనవేసుకుని ఉంటాయి. పనులకాలంలో చెట్టూచేమా.. పరిసరాలన్నీ పచ్చదనంతో కళకళలాడితే, మనుషుల ముఖాల్లో సంతోషం, సంతృప్తి పొంగిపొరలుతుంటాయి. అడపాదడపా కురుస్తూనేవున్న వానలతో తిరుపతి జిల్లాలో వ్యవసాయ పనులు జోరుగా మొదలయ్యాయి. చెరువుల్లోకి కొత్త నీళ్లు చేరాయి. వంకలు పారుతున్నాయి. తెల్లవారకముందే రైతులూ, రైతు కూలీలూ పనిముట్లతో బయలుదేరుతున్నారు. 'అన్నా..వదినా.. మామా..బావా.. పిల్లా..' అంటూ చతుర్లాడుకుంటూ పొలాల్లోకి దిగుతున్నారు. ఒకవైపు నారు పెరికి కట్టలు కడుతున్నారు.. మరొకవైపు అడుసుదున్ని మడులను సిద్ధం చేస్తున్నారు.. ఇంకోవైపున నాట్లేస్తున్నారు. ముందస్తుగా నాటి ఏపుగా పెరిగిన పైర్లలో మందులు చల్లుతున్నారు.. పురుగూ పుట్రా ఏరుకుతింటూ రైతునేస్తాలు కొంగలు గుంపులుగా ఎగురుతూ వాలుతూ కనువిందు చేస్తున్నాయి. బుధవారం ఇంకా మంచు తెరలు వీడని వేకువ వేళ.. తిరుపతి సమీపంలోని అన్నాసాంపల్లి పరిసరాల్లోని ఈ అందాలను ఆంధ్రజ్యోతి తిరుపతి ఫోటోగ్రాఫర్ ఫోటో పట్టి అందిస్తున్నారు..







వ్యాపారితో మాట్లాడుతున్న టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి

వ్యాపారుల లైసెన్సుల డిజిటలైజేషన్

● టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి

తిరుమల, నవంబరు20(ఆంధ్రజ్యోతి): తిరుమలలో వ్యాపారుల లైసెన్సులను డిజిటలైజేషన్ చేసి దుర్వినియోగం కాకుండా చర్యలు తీసుకుంటామని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి తెలిపారు. ఒకే లైసెన్స్‌తో రెండు మూడు ప్రాంతాల్లో వ్యాపారాలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అనధికారికంగా వ్యాపారాలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బుధవారం సాయంత్రం ఆయన తిరుమలలోని పలు ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు చేశారు. డీఎంబీ రోడ్డులోని అన్నపూర్ణ హోటల్ భవనాన్ని ఆయన పరిశీలించారు. దుకాణాల లైసెన్సులను తనిఖీ చేశారు. ఓ టీ దుకాణంలో టీ తాగి ధరలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వెంకయ్య చౌదరి మీడియాతో మాట్లాడుతూ.. అన్నపూర్ణ హోటల్ శిథిలావస్థకు చేరుకోవడంతో పరిశీలించామన్నారు. ఇంజనీరింగ్ అధికారుల నివేదిక ఆధారంగా త్వరలో నిర్ణయం తీసుకుంటామన్నారు. ఆయన వెంట డిప్యూటీఈవో ఆశాజ్యోతి, ఎలక్ట్రికల్ డీఈ చంద్రశేఖర్, రెవెన్యూ ఏఈవో భాస్కర నారాయణ చౌదరి ఇతర అధికారులు పాల్గొన్నారు.

గరుడాచలం నుంచీ అరుణాచలానికి

● సంస్కృత వర్సిటీ విద్యార్థి ఆచూకీ లభ్యం



కశ్యప ఆదిత్యను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జాతీయ సంస్కృత యూనివర్సిటీ డిగ్రీ ఫైనలియర్ విద్యార్థి కశ్యప ఆదిత్య ఆచూకీని పోలీసులు గుర్తించారు. యూనివర్సిటీలోని గరుడచాలం హాస్టల్‌లో వసతి పొందుతున్న ఇతడు.. కనిపించడం లేదంటూ పోలీసులకు కుటుంబీకులు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. హాస్టల్‌లోనే ఫోన్, గుర్తింపు కార్డు వదిలి పెట్టి వెళ్లారు. అరుణాచలం నుంచీ కుటుంబ సభ్యులకు ఫోన్ చేసినట్టు పోలీసులు తెలిపారు. దీంతో విద్యార్థి కశ్యప ఆదిత్య లోకేషన్‌ను పోలీసులు కనుక్కున్నారు. తిరుపతి వెస్ట్ పోలీస్ స్టేషన్‌కు రప్పించారు. బుధవారం సాయంత్రం అతడిని తండ్రి ప్రకాష్, సోదరుడు సాత్విక్‌సూర్యకు అప్పగించారు.

ముగ్గురు సీఐలకు రెగ్యులర్ ఉత్తర్వులు


తిరుపతి(నేరవిభాగం), నవంబరు 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అటాచ్‌మెంటులో పనిచేస్తున్న ముగ్గురు సీఐలను ఆయా స్థానాల్లో రెగ్యులర్ చేస్తూ అనంతపురం డీఐజీ షిమోషీ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందు, చంద్రగిరి సీఐ సుబ్బరామిరెడ్డి, యూనివర్సిటీ సీఐ రామయ్య ఉన్నారు. పనితీరు, క్రమశిక్షణ, ఇతరత్రా కారణాలను కొలమానంగా తీసుకుని ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.71 కోట్లు

తిరుమల, నవంబరు20(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.71 కోట్లు లభించింది. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ మంగళవారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు ఆదాయం వివరాలను టీటీడీ బుధవారం ఉదయం ప్రకటించింది. మంగళవారం 62,248 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 18,852 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు.

పంచారామాలకు ప్రత్యేక ప్యాకేజీ టూర్

తిరుపతి(ఆర్టీసీ), నవంబరు 20(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసాన్ని పురస్కరించుకుని పంచారామాలను సందర్శించేందుకు ఏపీఎస్ ఆర్టీసీ శుక్రవారం ప్రత్యేక ప్యాకేజీ టూర్ ఏర్పాటు చేసింది. మధ్యాహ్నం ఒంటి గంటకు సెంట్రల్ బస్టాండులో సూపర్ లగ్జరీ బస్సు బయలుదేరుతుంది. నెల్లూరు, గుంటూరు, విజయవాడ మీదుగా సామర్లకోట, ద్రాక్షారామం, పాలకొల్లు, భీమవరం, అమరావతి నుంచి తిరుగు ప్రయాణమై ఈనెల 24న ఉదయం తిరుపతికి చేరుకుంటుంది. టికెట్ ధర రూ.2,500గా నిర్ణయించారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తిరుపతి డిపో మేనేజర్ బాలాజీ కోరారు.



పూజలు చేస్తున్న వేదపండితులు

వేదోక్తంగా లక్ష బిల్వార్చన అర్చన

శ్రీకాళహస్తీశ్వరాలయంలో లక్ష బిల్వ, కుంకుమార్చను వేదోక్తంగా నిర్వహించారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఆలయ అలంకార మండపంలో కార్యక్రమాన్ని రుత్వికులు ప్రారంభించారు. ఆలయ అనువంశిక ప్రధాన అర్చకుడు స్వామినాథన్ గురుకుల్ ఆధ్వర్యంలో మొదట సంకల్ప పూజలు శాస్త్రోక్తంగా చేపట్టారు. మధ్యాహ్నం వరకు మూడు కాలాల పాటు అర్చన సాగింది. అనంతరం సాయంత్రం నాలోగ కాలం అర్చన చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకుడు సంబంధం గురుకుల్, ఏఈవో లోకేష్‌రెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ హరియాదవ్, వేదపండితులు, అర్చకులు, ఆలయ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి



బుధవారం చెన్నైలోని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో జరిగిన పార్టీ రాష్ట్ర శాఖ కోర్ కమిటీ సమావేశంలో పాల్గొన్న బీజేపీ తమిళనాడు-కర్ణాటక రాష్ట్రాల కో-ఇన్‌చార్జ్ డాక్టర్ పొంగులేటి సుధాకర్‌రెడ్డి, జాతీయ ఈసీ సభ్యులు హెచ్.రాజా, తమిళనాడు ఇన్‌చార్జ్ అరవింద్ మేనన్, ఎమ్మెల్యేలు నయనార్ నాగేంద్రన్, వానతి శ్రీనివాసన్, సీనియర్ నేతలు పొన్ రాధాకృష్ణన్, తమిళిసై సౌందరరాజన్, ఎం.చక్రవర్తి తదితరులు

సమాజ సేవలో జీఆర్‌టీ జ్యూవెలర్స్

● పోరూర్‌లో పేద విద్యార్థుల కోసం హాస్టల్



పోరూర్‌లో ఏర్పాటైన జీఆర్టీ మహాలక్ష్మి హాస్టల్

చెన్నై, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నగల విక్రయాల్లో పేరొందిన జీఆర్టీ జ్యువెలర్స్ సమాజ సేవలో కూడా తన వంతు పాత్ర పోషిస్తోంది. ఆ క్రమంలో పోరూర్‌లో జీఆర్టీ మహాలక్ష్మి బాయ్స్ హాస్టల్ ప్రారంభించింది. ఈ హాస్టల్‌లో 200 మందికి వసతి ఉండగా, ప్రస్తుతం ఫస్టియర్ విద్యార్థులు 60 మంది ఉన్నారు. ప్రతి విద్యా సంవత్సరంలో మొదటి సంవత్సరం విద్యార్థులను హాస్టల్‌లో చేర్చుకోనున్నారు. ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులు తమ కష్టాలు, బాధలు మరచి ప్రశాంత వాతావరణంలో చదువుకునేలా ఈ హాస్టల్ ఏర్పాటైంది. ఈ విషయమై జీఆర్టీ జ్యువెలర్స్ మేనేజింగ్ డైరెక్టర్లు జీఆర్ రాధాకృష్ణన్, ఆనంద్ అనంతపద్మనాభన్ మాట్లాడుతూ.. నిజమైన సేవలు క్రమశిక్షణ, కట్టుబాట్లు, కరుణతో కూడుకుంటుందని, ఈ మూడు సేవలను తమ సంస్థ సమర్థవంతంగా నిర్వహిస్తుందని అవరోధాలు అధికమించి తమ ఆశయాలు నెరవేర్చుకొనేందుకు ఆరాటపడే విద్యార్థులకు తగిన విద్యావకాశాలు కల్పించడంలో తమ సంస్థ ముందంజ లో ఉందని ఆయన తెలిపారు.



భోజనం చేస్తున్న విద్యార్థులు

ఇలా విద్యార్థులందరికీ విద్యా సహాయాలు నిర్వహించడాన్ని తామెంతో గర్వకారణంగా భావిస్తున్నామని వారు తెలిపారు.

రేపటి నుంచి చెన్నైలో

'ఫిబా' ఆసియా కప్ క్వాలిఫైర్స్



వివరాలు వెల్లడిస్తున్న నిర్వాహకులు

చెన్నై, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గత కొద్దికాలంగా నగరంలో వేడి పుట్టిస్తున్న బాస్కెట్‌బాల్ 'ఫీబా' ఆసియా కప్ ఛాంపియన్‌షిప్ పోటీలు ఊపందుకున్నాయి. ఇందులో భాగంగా ఈ నెల 22, 25 తేదీల్లో క్వాలిఫయర్స్ (విండోస్2) జరుగనున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. క్వాలిఫయర్ భారత జట్టు కెప్టెన్ బెక్ హఫీజ్, బాస్కెట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఈసీ సభ్యుడు, తమిళనాడు బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి అజీజ్ అహ్మద్, హెడ్ కోచ్ స్కాట్ ఫ్లెమింగ్, బీఎఫ్ఐ అధ్యక్షుడు ఆదవ్ అర్జున, బీఎఫ్ఐ కోశాధికారి చెంగల్రాయ నాయుడు తదితరులు చెన్నైలో మీడియాకు వివరాలు వెల్లడించారు. ఈ టోర్నమెంట్‌లో ఆసియాకు చెందిన 24 జట్లు పాల్గొంటున్నాయని, ఈ ఈవెంట్‌ను చెన్నైకు తీసుకురావడం వల్ల ఈ ప్రాంతంలో బాస్కెట్ బాల్ అభివృద్ధి చెందుతుందని వారు వివరించారు. తద్వారా అంతర్జాతీయ క్రీడలకు రాష్ట్రం వేదిక కావడానికి ఇదొక మార్గంగా వుంటుందన్నారు. భారత సీనియర్ పురుషుల బాస్కెట్‌బాల్ జట్టు 22న ఖతార్‌తో, 25న కజకిస్థాన్‌తో తలపడుతుందని వారు వివరించారు.